RNI No.TELTEL/2005/16755
# ప్రజాబలం
PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక
Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers




హైదరాబాద్ | 04 జూన్ 2026 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:4

# పెట్టుబడులకు ఆహ్వానం..
# ప్రోత్సహకాలు పుష్కలం

## దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ ముసలైల్తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

వార్తా 2 లో



# ఢిల్లీలో ఘోర అగ్ని ప్రమాదం..
# 20 మంది దుర్మరణం




దేశ రాజధాని ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దక్షిణ ఢిల్లీలోని మాల్వియా నగర్ ప్రాంతంలో ఉన్న లెమన్ గ్రీన్ రెస్టారెంట్‌లో బుధవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 20 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 11 మంది గాయపడ్డారు. హౌజ్ రాణి ప్రాంతంలో ఉన్న ఈ రెస్టారెంట్‌లో ఉదయం సుమారు 8.50 గంటల సమయంలో మంటలు చెలరేగినట్లు అధికారులు తెలిపారు. ఉదయం 9.45 గంటలకు అగ్నిప్రమాదంపై సమాచారం అందుకున్న ఢిల్లీ ఫైర్ సర్వీస్ వెంటనే స్పందించి అగ్నిమాపక సిబ్బంది, సహాయక బృందాలను ఘటనాస్థలికి తరలించింది. మంటలు వేగంగా వ్యాపించడంతో రెస్టారెంట్ బేస్‌మెంట్‌లో చిక్కుకుపోయిన పలువురు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అగ్నిమాపక సిబ్బంది సాహసోపేతంగా 37 మందిని బేస్‌మెంట్ నుంచి రక్షించి, క్యాట్స్ అంబులెన్స్‌ల ద్వారా ఆస్పత్రులకు తరలించారు. అనంతరం గాయపడిన 11 మందికి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులు స్పందిస్తూ.. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యుల నివేదిక వచ్చిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. మరోవైపు మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు 10 అగ్నిమాపక వాహనాలను రంగంలోకి దించారు. అగ్నిప్రమాదం అదుపులోకి వచ్చినప్పటికీ భవనంలో మరెవరైనా చిక్కుకుపోయి ఉన్నారేమోనన్న అనుమానంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అగ్నిమాపక శాఖ, పోలీసులు భవనాన్ని పూర్తిగా తనిఖీ చేస్తున్నారు. అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఘటనపై కేసు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు చేపట్టారు. మంటలు ఎలా చెలరేగాయి? భవనంలో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు పాటించారా? అనే అంశాలపై విచారణ కొనసాగుతోంది.


## ఖాదిర్ అలీ బేగ్ వారసత్వం కళాజగత్తుకు స్ఫూర్తి: గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా

వార్తా 3 లో



## కర్ణాటకలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది
### ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం

వార్తా 2 లో



### రాష్ట్రంలో సవరించిన భూముల మార్కెట్ విలువలు జూన్ 5, నుంచి అమలు
# మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

వార్తా 2 లో





## తెలంగాణ రాష్ట్రంలో 3,4,తేదీల్లోపలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు



హైద్రాబాద్ జూన్ 3 :తెలంగాణ రాష్ట్రంలో ఇవాళ, రేపు పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణశాఖ ప్రకటించింది. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణలో ఇవాళ రేపు ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని, గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది.

ఉరుములు, మెరుపులతో ఈదురు గాలులు : ఉమ్మడి ఆదిలాబాద్ పాటు కుమురంభీం ఆసిఫాబాద్?, నిర్మల్?, మంచిర్యాల, నిజామాబాద్?, జగిత్యాల, కరీంనగర్?, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, ములుగు, జయశంకర్? భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, ఖమ్మం, సూర్యాపేట, హనుమకొండ, వరంగల్? జిల్లాలకు ఆరెంజ్? అలర్ట్ హెచ్చరికలు? ?జారీ చేసింది. ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్?తో పాటు యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ జారీ చేసింది. ఉరుములు, మెరుపులతో ఈదురు గాలులు వీస్తాయని హెచ్చరించింది.

రేపు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ తో పాటు నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, నిజామాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు, ఉమ్మడి ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు.

# ప్రపంచవ్యాప్తంగా మేడ్ ఇన్ తెలంగాణ" బ్రాండ్...

## బొర్వట్లలో రూ.1,000 కోట్లతో 'థెరానైమ్ బయోలాజిక్స్' ప్లాంట్ ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు.







**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 03(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా మార్చే దిశగా మరో కీలక అడుగు పడింది,సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బొర్వట్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన థెరానైమ్ బయోలాజిక్స్ తయారీ కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బుధవారం అధికారికంగా ప్రారంభించారు,ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ,టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు,ప్రముఖ ఔషధ సంస్థ 'అరబిందో ఫార్మా'కు చెందిన పూర్తి స్థాయి అనుబంధ విభాగమైన థెరానైమ్ బయోలాజిక్స్, దాదాపు రూ.1,000 కోట్ల భారీ పెట్టుబడితో ఈ అత్యాధునిక ప్లాంట్‌ను నిర్మించింది,ఈ భారీ ప్లాంట్ ఏర్పాటు ద్వారా స్థానిక ప్రాంతానికి చెందిన 1,500 మందికి పైగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి తెలిపారు,ఈ బయోలాజికల్ ప్లాంట్‌లో క్యాన్సర్ మరియు ఇతర ప్రాణాంతక వ్యాధుల చికిత్సలో ఉపయోగించే అత్యాధునిక బయోలాజిక్స్,జీవ రసాయన మందులను తయారు చేయనున్నారు,ఇక్కడ ఉత్పత్తి అయ్యే నాణ్యమైన ఔషధాలను అమెరికా సహా పలు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయనున్నారు. “మేడ్ ఇన్ తెలంగాణ” బ్రాండ్ ప్రతిష్టను ఇది ప్రపంచవ్యాప్తంగా మరింత పెంచుతుందని మంత్రి శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు,థెరానైమ్ సంస్థ గ్లోబల్ ఫార్మా దిగ్గజం సింగపూర్ విభాగంతో కుదుర్చుకున్న మాస్టర్ సర్వీస్ అగ్రిమెంట్ లో భాగంగా ఈ కాంట్రాక్ట్ బయో-మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంట్‌ను నిర్మించింది,ఈ ఫెసిలిటీలో అత్యాధునిక మేమాలియన్ సెల్ కల్చర్ బయోరియాక్టర్లతో పాటు, ఏడాదికి సుమారు 2.5 నుంచి 3 కోట్ల (25-30 మిలియన్) వయల్స్ ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉన్న ఐసోలేటర్ లైన్లను ఏర్పాటు చేశారు,తెలంగాణలో పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడమే కాకుండా స్థానికులకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని,ఫార్మా రంగ పెట్టుబడులకు తెలంగాణ ఎల్లప్పుడూ మొదటి ప్రాధాన్యతగా నిలుస్తుందని ఈ సందర్భంగా మంత్రి ?డి. శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు,ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, ఉన్నతాధికారులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు

# ప్రజాబలం

## 04 జూన్ 2026 గురువారం


### విద్యార్థుల జీవితాలతో ఆటలా...

సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ 12వ తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో అనేక లోపాలు, తేడాలు బయటపడడం దేశవ్యాప్తంగా అలజడి సృష్టిస్తోంది. నీట్ ప్రశ్నపత్రాల లీక్ సంఘటన మరువక ముందే సిబిఎస్ఇ 12వ తరగతి ఫలితాలు వివాదాస్పద చర్చకు దారితీస్తున్నాయి. సిబిఎస్ఇ కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ వల్లనే ఈ గందరగోళం ఏర్పడింది.సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) విద్యార్థుల పునఃమూల్యాంకన దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలో తమ పోర్టల్‌పై భారీ సైబర్ దాడికి ప్రయత్నాలు జరిగాయని సీబీఎస్ఈ ప్రకటించింది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో 16 వేల మంది రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొంది. ఈ సమయంలోనే కొందరు డినయల్-ఆఫ్-సర్వీస్ అనే విధానంతో పోర్టల్‌పై దాడికి ప్రయత్నించారని, దీని వల్ల 2 నిమిషాల్లోనే దాదాపు 15 లక్షల మంది లాగిన్ అవ్వడానికి ప్రయత్నించారని తెలిపింది. అనధికారికంగా పోర్టల్‌లోకి చొరబడేందుకు లక్షకుపైగా సైబర్‌దాడుల ప్రయత్నాలు జరిగినట్లు తమ భద్రత వ్యవస్థ గుర్తించిందని వివరించింది.అయితే, ఈ సైబర్ దాడులను సమర్థంగా అడ్డుకున్నామని, ప్రస్తుతం పోర్టల్ పనిచేస్తూనే ఉందని చెప్పింది. విద్యార్థుల రీవేల్యూషన్ దరఖాస్తులను ప్రాసెస్ జరుగుతోందని తెలిపింది. ఒకేసారి 8,000 మందికిపైగా స్టూడెంట్లు పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చిన వెల్లడించింది. టెక్నికల్ టీమ్‌లు ఈ ప్లాట్‌ఫామ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని.. ఏదైనా ఇబ్బంది తలెత్తితే వెంటనే స్పందిస్తున్నాయని పేర్కొంది. విద్యార్థులకు ఎటువంటి అంతరాయం లేకుండా సేవలను అందించేందుకు తమ బృందాలు కృషి చేస్తున్నాయని సీబీఎస్ఈ పేర్కొంది.ప్లస్‌టూ లో సీబీఎస్ఈ కొత్తగా తీసుకొచ్చిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానం కారణంగా తమ జవాబు పత్రాలు తారుమారయ్యాయంటూ కొందరు విద్యార్థులు ఆందోళనలు వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీనిపై తీవ్ర దుమారం రేగడంతో సీబీఎస్ఈ స్పందించింది. సమాధాన పత్రాల స్కానింగ్ కాపీలను విద్యార్థులకు అందిస్తామని, వాటిని పరిశీలించిన తర్వాత రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. పునఃమూల్యాంకనం కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకునే పోర్టల్‌పైనే తాజాగా సైబర్ దాడి జరిగినట్లు వెల్లడించింది. జాతీయ స్థాయి పరీక్షలైన క్యూట్‌యుజి వల్ల విద్యార్థులు వేర్వేరు విశ్వవిద్యాలయాలకు ప్రత్యేకంగా ఎంట్రన్స్ పరీక్షలు రాయవలసిన అవసరం లేకుండా ఒకే పరీక్ష ద్వారా దేశంలోని అత్యుత్తమ యూనివర్శిటీల్లో సీట్లు పొందగలుగుతారు. అయితే క్యూట్‌లో ఎదురవుతున్న సాంకేతిక లోపాలు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, సిబిఎస్ఇల్లో పదేపదే జరుగుతూ విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చివేస్తున్నాయి.సిబిఎస్ఇ 12వ తరగతి పరీక్షల ఫలితాలను పరిశీలిస్తే ఉత్తీర్ణత శాతం గత ఏడాది 88.39 శాతం ఉండగా, ఈ ఏడాది 85.29 శాతానికి దిగజారింది. 90 శాతం కన్నా స్కోరు సాధించిన విద్యార్థుల సంఖ్య కూడా బాగా తగ్గింది. దీంతో చాలా మంది విద్యార్థులు తాము ఆశించిన విధంగా ఫలితాలు రాకపోవడంతో మూల్యాంకనం కోసం ఆశ్రయించారు. 4 లక్షలకు మించి విద్యార్థులు జవాబు పత్రాల స్కానింగ్ కాపీలు కావాలని అభ్యర్థించారంటే ఎంత మంది ఈ ఫలితాలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారో తెలుస్తోంది. ఫిబ్రవరి 17న ఈ 12వ తరగతి పరీక్షలు జరగ్గా, ఈ పరీక్షలకు కేవలం పదిరోజులకు ముందుగా ఆన్‌లైన్ స్క్రీన్ మార్కింగ్ అమలు గురించి ఉపాధ్యాయులకు తెలియజేయడం విడ్డూరం. ఈ కొత్త పద్ధతిపై ఉపాధ్యాయులకు ఎంతవరకు అవగాహన ఉంది? వారు స్కానింగ్ చేసిన జవాబు పత్రాలను డిజిటల్ ప్రక్రియలో దిద్దగలరా? స్కానింగ్ కాపీలు స్పష్టంగా ఉంటున్నాయా? ఇవేవీ పరిశీలించకుండానే హడావిడిగా అమలు చేయడం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కూడా ఇదో అగ్నిపరీక్షగా తయారై అనేక లోపాలు పుట్టుకొచ్చాయి. ఫిబ్రవరి 9న సిబిఎస్ఇ జారీ చేసిన సర్కులర్‌లో ఆన్‌లైన్ స్క్రీన్ మార్కింగ్ ప్రక్రియ వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని వివరించింది. విద్యా సంస్కరణల్లో నూతన అధ్యాయం తప్పులు పూర్తిగా తొలగించవచ్చని, మానవ సహాయం చాలావరకు తగ్గుతుందని, మూల్యాంకనం అంటే పేపర్లు దిద్దడం చాలా వేగంగా జరుగుతుందని, ఫలితాలు వెలువడిన తరువాత తిరిగి పరిశీలించవలసిన అవసరం రాదని ఇలా ఎన్నెన్నో పేర్కొంది. కానీ ఆచరణాత్మకం వాటికి భిన్నంగా ఫలితాలు కనిపించాయి. 17 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. అంటే వీరికి 98 లక్షల జవాబు పత్రాల పుస్తకాలు అందించారు. అంటే 40 కోట్ల పేజీలు ఇచ్చినట్టు. ఇవన్నీ మాన్యువల్‌గా రికార్డు సమయానికి స్కానింగ్ చేయవలసి ఉంటుంది. మూల్యాంకనం కోరిన వారికి ఇవన్నీ పరిశీలించవలసి ఉంటుంది. దీనికి తగిన కనీస మౌలిక అవసరాలు, కంప్యూటర్లు, లాకింగ్ సిస్టమ్ తదితర సాంకేతికత సరిగ్గా లేక గందరగోళం ఏర్పడి తప్పుల కుప్పలు కనిపిస్తున్నాయి. అంటే సిబిఎస్ఇ పరీక్షల నిర్వహణ ఎంత లోపభూయిష్టంగా ఉందో స్పష్టమవుతోంది. స్కానింగ్ వ్యవస్థ పూర్తిగా అందుబాటులోకి రాకుండా ఆన్‌స్క్రీన్ మార్కింగ్ ప్రక్రియను ఎందుకు సిబిఎస్ఇ ప్రవేశపెట్టిందో అర్థంకావడం లేదు. ఇది క్షమించరానిది. ఇది తాత్కాలిక సర్దుబాటుగా సిబిఎస్ఇ చెబుతున్నా సక్రమంగా అంతవరకు ఉన్న వ్యవస్థను నాశనం చేసినట్టే. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? ఈ లోపాలపై ఎవరు దర్యాప్తు చేస్తారు? లోక్‌సభ విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఈ ఆన్‌లైన్ స్క్రీన్ మార్కింగ్ వ్యవస్థ వల్ల మూల్యాంకనం తప్పులు, అక్రమాల పుట్టగా తయారైందని ధ్వజమెత్తారు. సిబిఎస్ఇ పొరపాటు వల్ల మార్కులు తప్పుగా వస్తే, దానికి మీకు బిల్లుపడుతుందన్నారు. డిజిటల్ స్కాన్ కాపీ తీసుకోవాలంటే ఒక సబ్జెక్టుకు రూ. 100, ఒక పేపర్ రీటోటలింగ్‌కు రూ. 100, రీ ఎవాల్యుయేషన్ చేయించుకోవాలంటే ఒక ప్రశ్నకు రూ. 25, మొత్తంగా ఒక విద్యార్థి తన జవాబు పత్రాన్ని సరిగ్గా దిద్దించుకోవడానికి దాదాపు రూ. 2000 చెల్లించవలసి రావచ్చన్నారు. మొత్తం 4 లక్షల మంది విద్యార్థులు మూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు సిబిఎస్ఇ ఎంత సొమ్ము ఆర్జిస్తోందో గమనించాలని విద్యార్థులకు సూచించారు. ఇదంతా శిక్ష పడుతున్నది విద్యార్థులకు, ఆదాయం ప్రభుత్వానికి అని ఎద్దేవా చేశారు. ఇదిలా ఉండగా ఈ పరీక్షల నిర్వహణకు ఎడ్యుటెక్ అనే సంస్థను సిబిఎస్ఇ ఎంపిక చేయడాన్ని ఆక్షేపించారు. తెలంగాణలో గ్లోబరేనా అనే పేరుతో ఈ సంస్థ 2019, 2023లో స్కామ్‌కు పాల్పడిందని, అలాంటి రికార్డు ఉన్న సంగతి సిబిఎస్ఇకి తెలియదా? అని ప్రశ్నించారు. ఈ కంపెనీ రికార్డు తెలిసినా దీన్ని ఎంచుకోవడంలో ఏదో నిగూఢమైన కారణం ఉందని ఆరోపించారు. అయితే ప్రభుత్వ ప్రొక్యూర్‌మెట్ పాలసీ ప్రకారమే ఈ కంపెనీని ఎంపిక చేసినట్టు సిబిఎస్ఇ వెల్లడించింది. అయితే జవాబు పత్రాల మూల్యాంకన పోర్టల్‌లోని లోపాలను వినియోగదారులు బయటపెట్టడంతో సిబిఎస్ఇ వాటిని అంగీకరించడమే కాక, ఈ కంపెనీపై జరిమానా విధించడానికి సిద్ధమైనట్టు తెలుస్తోంది. విద్యార్థులు తమ బాల్యం లోని మంచి దశను, వారి ఆత్మస్థైర్యాన్ని నాశనం చేసే బోర్డు, ప్రవేశ పరీక్షల కోసం త్యాగం చేయవలసి వస్తోందని పరీక్షల నిర్వాహకులు తెలుసుకోవాలి.

### రాష్టంలో సవరించిన భూముల మార్కెట్ విలువలు జూన్ 5, నుంచి అమలు

## మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

హైద్రాబాద్ జూన్ 3 ;రాష్ట్రంలో సవరించిన భూముల మార్కెట్ విలువలు జూన్ 5, 2026 నుంచి అమలు లోకి వస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.భూముల విలువల సవరణను శాస్త్రీయంగా, హేతుబద్ధంగా చేపట్టాంక్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ పరిస్థితుల విశ్లేషణ ఆధారంగా కొత్త విలువలను నిర్ణయించామని,సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు నిపుణుల సూచనలు, అధికారుల సలహాలతో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.ప్రాంతాల వారీగా మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ విలువల మధ్య వ్యత్యాసాలను పరిశీలించాంగత బీఆర్ఎస్ ప్రభుత్వం శాస్త్రీయ అధ్యయనం లేకుండా భూముల ధరలను పెంచింది2021-22లో ఆరు నెలల వ్యవధిలో రెండు సార్లు భూముల విలువలు పెంచారురిజిస్ట్రేషన్ ఛార్జీలను 6 శాతం నుంచి 7.5 శాతానికి పెంచింది బీఆర్ఎస్ ప్రభుత్వంగత ప్రభుత్వ సవరణలలో కొన్ని చోట్ల మార్కెట్ ధరల కంటే తక్కువ, మరికొన్ని చోట్ల అధికంగా విలువలు నిర్ణయించబడ్డాయిభూ లావాదేవీలలో ఏర్పడుతున్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పునర్విమర్శ చేపట్టాంరాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువల సమీక్ష నిర్వహించామన్నారు.

గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు స్థానిక పరిస్థితులను అధ్యయనం చేశాయి.అభివృద్ధి సామర్థ్యం, భూముల డిమాండ్, వేలాలు, మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్నాంఓఆర్?ఆర్?, ఆర్?ఆర్?ఆర్? కొత్త రహదారులు, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణను ప్రమాణాలుగా తీసుకున్నాంఫ్లాట్ల విషయంలో ఉన్న అసమానతలను తొలగిస్తూ కొన్ని ప్రాంతాల్లో అన్ని అంతస్తులకు ఒకే రేటు అమలు చేశారు.ఇప్పటికే అధిక మార్కెట్ విలువలు ఉన్న ప్రాంతాల్లో ఎలాంటి పెంపు ప్రతిపాదనలేదన్నారు.హెచ్?ఎండీఏ, సీయూఆర్?ఈ పరిధి, ఇతర ప్రాంతాలకు కనీస ప్రాథమిక మార్కెట్ రేట్లు నిర్ణయించాంవ్యవసాయ భూములు, ప్లాట్లు, ఫ్లాట్లకు కొత్త కనీస రేట్లు ఖరారు చేశాం2021 తర్వాత నిర్మాణ వ్యయాలు సవరించకపోవడంతో కొత్త రేట్ల అవసరం ఏర్పడిందినిర్మాణ సామగ్రి ధరలు, కార్మికుల వేతనాల పెరుగుదలను పరిగణన లోకి తీసుకున్నాంఆర్‌సీసీ, నాన్-ఆర్‌సీసీ నిర్మాణాల రేట్లను గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సవరించాంప్రజలకు ఇబ్బందులు కలగకుండా,పారదర్శకతతోఈసవరణలు చేపట్టాంభూ లావాదేవీలలో పారదర్శకత పెరగడంతో పాటు ప్రభుత్వ ఆదాయం కూడా వృద్ధి చెందుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## కర్ణాటకలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది.

## ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు.

లోక్ భవన్‌లోని గ్లాస్‌హౌస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ థావర్ ?చంద్ గహ్లోత్ డీకే శివకుమార్?తో ప్రమాణం చేయించారు. అలాగే సీనియర్ నేత జి.పరమేశ్వర్ ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ఇద్దరితోపాటు మరో 12 మంది మంత్రులుగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్?సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య, కేరళ సీఎం సతీశన్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అజారుద్దీన్ హాజరయ్యారు.

**చేతిలో రాజ్యాంగం**

ప్రమాణ స్వీకారానికి ముందు డీకే వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. ఆ తర్వాత తాజా మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను డీకే సత్కరించారు. అనంతరం తన తాతయ్య గంగాధరయ్య చిత్రపటానికి నివాళులర్పించి ఆయన్ను స్మరించుకుంటూ కర్ణాటక రాష్ట్రానికి 34వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ సమయంలో డీకే చేతిలో రాజ్యంగం బుక్ అందర్నీ ఆకర్షించింది. చేతిలో రాజ్యాంగం బుక్?ను పట్టుకుని అయన ప్రమాణం చేశారు.

మంత్రులుగా సిద్ధరామయ్య, ఖర్గే కుమారులు

కాగా, డీకే కేబినెట్?లో మాజీ సీఎం సిద్దరామయ్య కుమారుడు యతీంద్ర, ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటు దక్కింది. వీళ్లతోపాటుగా కె.హెచ్.మునియప్ప, కె.జె.జార్జ్, ఎం.బి.పాటిల్, రామలింగారెడ్డి, సతీశ్ జర్కిహోళి, కృష్ణబైరెగౌడ, యు.టి.ఖాదిర్, ఈశ్వర్ ఖండ్రే, బైరతి సురేశ్, శరణ్ ప్రకాశ్ పాటిల్?తో గవర్నర్ థావర్?చంద్ ప్రమాణం చేయించారు. దీంతో కర్ణాటకలో డీకే శివకుమార్ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది.

## పెట్టుబడులకు ఆహ్వానం.. ప్రోత్సహకాలు పుష్కలం

## దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ ముసటైల్తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ



హైదరాబాద్, జూన్ 3 : రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపించే దక్షిణాఫ్రికా పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం అందించడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ పాలస్ షిపొకోసా మషటైల్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి తో భేటీ అయింది. ఈ భేటీలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.. దక్షిణాఫ్రికా-తెలంగాణ మధ్య వాణిజ్య సంబంధాలను, ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లేఅంశంపై ఈ సమావేశంలో చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను ముఖ్యమంత్రి వివరించారు. పెట్టు బడులకు సై సమావేశంలో దషటైల్‌మాట్లాడుతూ... “తెలంగాణలో మా ప్రతినిధి బృందానికి ఆత్మీయ స్వాగతం పలికినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు. తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సవం వేళ ప్రభుత్వానికి, ప్రజలకు శుభాకాంక్షలు. ఈ వేడుకల సందర్భంగా మీ మధ్య ఉండటం గౌరవంగా భావిస్తున్నాం. ఈపర్యటనలో శాస్త్రీయ, సాంకేతిక మరియు పెట్టుబడి సహకార రంగాల్లో మరింత విస్తృత భాగస్వామ్యాన్ని మేము ఆశిస్తున్నాం” అని వ్యాఖ్యానించారు. “భారతదేశంలోని అత్యంత యువ రాష్ట్రాల్లో ఒకటైన కాలంలోనే భారత జాతీయ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)కి అత్యధికంగా తోడ్పడుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ, అతి తక్కువ ఒకటిగా ఎదగడం అభినందనీయం. తెలంగాణ ప్రజల పట్టుదల, సృజనాత్మకత, సంకల్పానికి ఈ విజయాలు నిదర్శనం” అని పేర్కొన్నారు.

దక్షిణాఫ్రికా కంపెనీలకు ఆహ్వానం

భారత్ దక్షిణాఫ్రికా మధ్య సంబంధాల విషయంలో చారిత్రక నేపథ్యాన్ని సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు వివరిస్తూ, “సాంకేతికత, ఔషధ రంగం, వ్యాక్సిన్లు, రక్షణ, ఏరోస్పేస్, పరిశోధన, విద్య, అరోగ్యం, తయారీ, నైపుణ్యాభివృద్ధి, క్రీడలు మరియు మౌలిక సదుపాయాల రంగాలలో తెలంగాణ విశిష్ట ప్రతిభను కలిగి ఉంది” అని చెప్పారు. “గ్రీన్ ఎనర్జీ, సుస్థిర అభివృద్ధి రంగాలలో తెలంగాణ వేగంగా ముందుకు సాగుతోంది. ద్వైపాక్షిక సంబంధాలను మరింత పెంచే అవకాశాలు ఉన్నందున తెలంగాణలో పెట్టుబడి అవకాశాలను పరిశీలించాలని దక్షిణాఫ్రికా కంపెనీలను ఆహ్వానిస్తున్నాం” అని చెప్పారు.

## మే నెలలో రికార్డు స్థాయిలో 1.21 కోట్ల తిరుపతి లడ్డూల విక్రయం



తిరుపతి జూన్ 03; కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానంతరం భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో స్వీకరించే శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయాలు ఈ ఏడాది మే నెలలో రికార్డు స్థాయికి చేరుకున్నాయి. భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో టీటీడీ లడ్డూ ఉత్పత్తిని కూడా విస్తృతంగా పెంచి, ఎలాంటి కొరత లేకుండా ప్రసాదాలను అందిస్తోంది. ఈ ఏడాది మే నెలలో మొత్తం 1,21,35,528 లడ్డూలు విక్రయమయ్యాయి. గత రెండేళ్లతో పోలిస్తే ఈ ఏడాది లడ్డూల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. 2024 మే నెలలో 1.01 కోట్ల లడ్డూలు విక్రయమవ్వగా, 2025లో 1.10 కోట్లకు పెరిగాయి. ప్రస్తుతం 2026లో 1.21 కోట్లకు పైగా విక్రయాలు నమోదవడం విశేషం.

లడ్డూ తయారీకి 68 టన్నుల ముడి పదార్థాల వినియోగం

అత్యంత పవిత్రమైన శ్రీవారి ప్రసాదమైన లడ్డూల తయారీ కోసం రోజువారీగా 68 టన్నులకు పైగా ముడి పదార్థాలను టీటీడీ వినియోగిస్తోంది. లడ్డూ తయారీకి రోజుకు సుమారు 32 టన్నుల చక్కెర, 16 టన్నుల శెనగపిండి, 16 టన్నుల నెయ్యి, 3.5 టన్నుల జీడిపప్పు, 2 టన్నుల ఎండుద్రాక్ష, 400 కిలోల యాలకులు, 800 కిలోల కలకండ వినియోగిస్తున్నారు. ఒక్క చిన్న లడ్డూ తయారీకి సగటున 167 నుండి 170 గ్రాముల ముడి పదార్థాలను ఉపయోగిస్తున్నారు. ఇందులో సుమారు 78 గ్రాముల చక్కెర, 39 గ్రాముల శెనగపిండి, 36 గ్రాముల నెయ్యి, 7 గ్రాముల జీడిపప్పు, 3 గ్రాముల ఎండుద్రాక్ష తదితర పదార్థాలు ఉంటాయి.

సంప్రదాయ దిట్టం ప్రకారమే తయారీ

శ్రీవారి ప్రసాదాల తయారీలో 1950, 1951 సంవత్సరాల్లో టీటీడీ ఆమోదించిన సంప్రదాయ “దిట్టం” ప్రమాణాలను నేటికీ ఖచ్చితంగా పాటిస్తున్నారు. నిత్య, వార, పక్ష, మాస, నక్షత్ర, సాలకట్ల ఉత్సవాలకు అనుగుణంగా సుమారు 20 రకాల అన్నప్రసాదాలు, 25 రకాల పణ్యారాలను సిద్ధం చేస్తున్నారు.

భక్తుల ప్రశంసలు

ఇటీవలి కాలంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత, రుచి మరింత మెరుగుపడటంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత, సంప్రదాయం, భక్తి భావనల సమ్మేళనంగా నిలిచిన శ్రీవారి లడ్డూ ప్రసాదం తిరుమల మహత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెబుతోంది.

# విశ్వకర్మ మహాసభజన్నారం మండల ప్రధాన కార్యదర్శి గా బండోజు లక్ష్మీ నర్సయ్య




హైద్రాబాద్ జూన్3 : అఖిల భారత విశ్వకర్మ మహాసభ మంచిర్యాల జిల్లా జన్నారం మండల ప్రధాన కార్యదర్శి గా బండోజు లక్ష్మీ నర్సయ్య నియమితులైనారు ఈ మేరకుఅఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాథం శ్రీరాముల గంగాధర్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు సూచనతో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ బండోజు లక్ష్మీ నర్సయ్య మంచిర్యాల జిల్లాలో సంఘ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్బంగా బండోజు లక్ష్మీ నర్సయ్య ను వర్కింగ్ ప్రెసిడెంట్ గుండోజు గంగాధర్, ప్రధాన కార్యదర్శి సంకోజు లింగా చారి, కోశాధికారి ఆవంచ మురళీధరాచారి , అధికార ప్రతినిధి పడాల సతీష్ చారి, గౌరవ సలహాదారు కనపర్తి లక్ష్మణ్ చారి మహిళా గౌరవ అధ్యక్షురాలు సావిత్రి పట్నాల, కస్తోజు శ్రావణి మహిళా అధికార ప్రతినిధి, ఇంద్రాల అశ్విని మహిళాఉపాధ్యక్షురాలు, బోనాల ఇందిర మహిళాకార్య దర్శి , దాసోజు లక్ష్మణా చారి ఉపాధ్యక్షులు, కొల్లోజు సురేష్ చారిప్రచార కార్యదర్శి, నరహరి చారి ముఖ్య సలహా దారు వీరాచారి జాయింట్ సెక్రటరీ, రాష్ట్ర కార్యదర్శి కర్ణకంటి నరసింహాచారి. ఉపాధ్యక్షుడు కట్ట వెంకటేష్. అధ్యక్షుడు దాసోజు లక్ష్మణ్ చారి, ఉపాధ్యక్షుడు శ్రీరామ్ మహిపాల్ చారి, వెంకట్ చారి సలహా దారు, ఎడవల్లి రాఘవాచారి యూత్ సెక్రటరీ, కొండోజు సురేష్ చారి అధ్యక్షుడు అంబర్ పేట, కె లోకనాథం జుజ మెంబర్, తదితరులు అభినందించారు. పాల్గొన్నారు. జై విశ్వకర్మ!

# నీటి ఆవాసాల నుంచి ఐదు సరికొత్త నీటి కీటకాల జాతులను కనుగొన్న భారతీయ శాస్త్రవేత్తలు



హైద్రాబాద్ జూన్ 3 ; అంతరించిపోతున్న జీవవైవిధ్యంలో సరికొత్త ఆశలు చిగురిస్తున్నాయి. యావత్ ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న వాతావరణ మార్పుల వేళ భారతీయ శాస్త్రవేత్తలు సరికొత్త రికార్డులు సృష్టించారు. దేశంలోని వివిధ నీటి ఆవాసాల నుంచి ఐదు సరికొత్త నీటి కీటకాల జాతులను కనుగొన్నారు. ఈ అరుదైన జాతులను ప్రపంచంలోనే మొదటిసారిగా భారత్‌లో గుర్తించడం విశేషం. ఈ గొప్ప ఆవిష్కరణకు సంబంధించిన వివరాలు అంతర్జాతీయ ప్రఖ్యాత జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. పరిశోధనకు సంబంధించి మరిన్ని విశేషాలు ఇప్పుడు చూద్దాం.

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల నేపథ్యంలో జీవవైవిధ్యంపై విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల కొన్ని జాతులు అంతరిస్తుంటే కొత్త జీవుల అన్వేషణ కూడా అంతే వేగంగా సాగుతోంది. ఇటీవల హైదరాబాద్ అత్తాపూర్‌లోని జువాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన ఇద్దరు యువ పరిశోధకులు. అరుదైన ఐదు కొత్త జల కీటక జాతులను కనుగొన్నారు. ఈ ఆవిష్కరణలు అంతర్జాతీయంగా గుర్తింపు పొందడమే కాకుండా ప్రఖ్యాత సైన్స్ జర్నల్స్‌లో కూడా ప్రచురితమయ్యాయి.

# సహాయ నిరాకరణలో అధికారులు - నేతల ఒత్తిళ్లు

హైదరాబాద్ జూన్ 3 తెలంగాణ గ్రామీణ ప్రాంతాలలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఇందిరమ్మ ఇళ్లు' పథకం ఇప్పుడు పల్లెల్లో తీవ్ర పొలిటికల్ హీట్ పుట్టిస్తోంది. ఎన్నికల హామీలలో భాగమైన 'ఆరు గ్యారంటీలలో' ఒకటైన ఈ పథకం కింద సొంత స్థలం ఉన్న నిరుపేదలకు ఇల్లు కట్టుకోవడానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తోంది. పథకం ఉద్దేశం అద్భుతమైనదే అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మాత్రం గ్రామాల్లో లొల్లికి, అధికార పార్టీలోనే అంతర్గత విభేదాలకు వేదికగా మారుతోంది. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడత ప్రారంభించారు. మొదటి విడతలో భాగంగా నియోజకవర్గానికి సగటున 3,500 ఇళ్ల చొప్పున ప్రభుత్వం కేటాయించింది. అయితే, గ్రామాల వారీగా చూస్తే ఒక్కో పంచాయతీకి కేవలం 30 నుండి 40 ఇళ్లు మాత్రమే కోటాగా వస్తున్నాయి. కానీ, ప్రతి పల్లెలోనూ దరఖాస్తు చేసుకున్న ఆశావహుల సంఖ్య వేలల్లో ఉండటంతో అసలు సమస్య మొదలైంది. గ్రామంలో అర్హులైన నిరుపేదలు వందల సంఖ్యలో ఉంటే, కేటాయించిన అరకొర ఇళ్లను ఎవరికి ఇవ్వాలో తెలియక స్థానిక అధికారులు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలు తలలు పట్టుకుంటున్నాయి.గ్రామ సభల ద్వారా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోయింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక లీడర్లు, మండల స్థాయి నేతలు తమ అనుచరులకు, ఎన్నికల్లో తమ కోసం పనిచేసిన కేడర్‌కే ఈ ఇళ్లను కేటాయించాలని అధికారులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. మరోవైపు, అర్హుల జాబితాలో అనర్హులు ఉంటే రేపు విపక్షాలు రచ్చ చేస్తాయనే భయంతో అధికారులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. కొన్ని చోట్ల నేతల గొడవలు భరించలేక అధికారులు గ్రామ సభలను వాయిదా వేస్తున్న ఉదంతాలు లోకల్ మీడియాలో హెడ్‌లైన్స్‌గా మారుతున్నాయి.ఇందిరమ్మ ఇళ్ల కోటా పంచాయతీ కాస్తా కాంగ్రెస్ పార్టీలోనే తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. చాలా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ సీనియర్ నేతలకు, ఇటీవలే పార్టీలోకి వచ్చిన కొత్త నేతలకు మధ్య ఇళ్ల కోటా పంపకాలపై విభేదాలు భగ్గుమంటున్నాయి. ఎన్నికల్లో కష్టపడి పార్టీని గెలిపించిన మాకు కాకుండా, మొన్నటికి మొన్న వచ్చిన వారికి ఎక్కువ ఇళ్ల కోటా ఎలా ఇస్తారు?" అంటూ పాత కాంగ్రెస్ క్యాడర్ తిరుగుబాటు బావుటా ఎగురవేస్తోంది. ఈ అంతర్గత గ్రూపు తగాదాలు కొన్ని గ్రామాలలో బాహాబాహీ తలపడేంత వరకు వెళ్లడం పార్టీ అధిష్టానానికి పెద్ద తలనొప్పిగా మారింది. గ్రామాల్లో సాగుతున్న ఈ గందరగోళాన్ని ప్రతిపక్షాలు రాజకీయంగా వాడుకోవడానికి సిద్ధమవుతున్నాయి. అర్హులైన పేదలను కాదని, కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకే 5 లక్షల రూపాయల సాయం అందిస్తున్నారంటూ వారు పల్లెల్లో ప్రచారానికి తెరలేపారు. గ్రామ సభల్లో నిరసనలు తెలపడం, అర్హుల జాబితాను సవరించాలంటూ కలెక్టరేట్ల ముట్టడికి ప్లాన్ చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గ్రామీణ ఓటర్లను సమీకరించే పనిలో పడ్డాయి. ఈ అసంతృప్తిని చల్లార్చేందుకు గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి రంగంలోకి దిగారు. తొలి ఏడాదిలోనే ప్రభుత్వం వేలాది ఇళ్లను పూర్తి చేసిందని, ప్రతి జిల్లాకు అదనంగా మరో 5 వేల ఇళ్లను మంజూరు చేస్తూ రెండో విడతను కూడా వేగవంతం చేస్తామని ఆయన ప్రకటిస్తున్నారు. ఒకే విడతలో అందరికీ ఇళ్లు ఇవ్వడం అసాధ్యమని, దశలవారీగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు దక్కుతుందని స్థానిక నేతలకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. "ఇందిరమ్మ ఇళ్లు" పథకం కాంగ్రెస్ ప్రభుత్వానికి మైలేజీ తేవాల్సిన స్కీమ్ అయినప్పటికీ, పంపిణీలో జరుగుతున్న వ్యూహాత్మక లోపాల వల్ల అది గ్రామాల్లో అసంతృప్తికి కారణమవుతోంది. కోటా తక్కువగా ఉండటం వల్ల లబ్ధి పొందిన ఒక్కరి కంటే, లబ్ధి పొందని వంద మందిలో వచ్చే వ్యతిరేకతే ఎక్కువగా కనిపిస్తోంది. మరి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల లోపే ఈ 'ఇళ్ల కోటా' వివాదాన్ని కాంగ్రెస్ అధిష్టానం ఎలా చక్కదిద్దుతుందో, క్యాడర్‌ను ఎలా శాంతింపజేస్తుందో చూడాలి.

# పవన్ సభను అడ్డుకోవడం సమంజసం కాదు అభివృద్ధిలో పోటీ పడాలి.. విద్వేషాల్లో కాదు

హైదరాబాద్, జూన్ 3 హైదరాబాద్‌లో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణ , దాని చుట్టూ సాగుతున్న రాజకీయ వివాదంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం తీవ్రంగా స్పందించారు. తెలంగాణ రాజకీయాల్లో పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని కొందరు నేతలు చేస్తున్న వ్యాఖ్యలను, పోలీసుల ఆంక్షలను ఆయన తప్పుబట్టారు. ప్రజాస్వామ్యంలో ఏ రాజకీయ పార్టీకైనా, ఏ నాయకుడికైనా ఎక్కడైనా పర్యటించే హక్కు ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పవన్ కల్యాణ్‌ను, జనసేన కార్యక్రమాలను అడ్డుకోవాలని చూడటం ఎంతమాత్రం కరెక్ట్ కాదని సీఎం చంద్రబాబు నాయుడు ఖరాఖండీగా చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీలు తమ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి సభలు, సమావేశాలు నిర్వహించుకోవడం సహజమని.. దాన్ని అడ్డుకోవాలని చూడటం అప్రజాస్వామికమని మండిపడ్డారు. పవన్ కల్యాణ్ సభకు ఆంక్షలు విధించడం, ఆయనను టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించడం వెనుక ఉన్న రాజకీయ ప్రయోజనాలను ప్రజలు గమనిస్తున్నారని బాబు పేర్కొన్నారుభారతదేశంలో ఉన్న ఫెడరల్ స్ఫూర్తిని గుర్తు చేస్తూ చంద్రబాబు ఈ సందర్భంగా కీలక ఉదాహరణలను లేవనెత్తారు. గతంలో తమిళనాడు ఎన్నికల సమయంలో నేను వెళ్లి అక్కడ ప్రచారం చేశాను. అలాగే కర్ణాటకకు చెందిన కాంగ్రెస్ నేత, ప్రస్తుత సీఎం డీకే శివకుమార్ కూడా ఇతర రాష్ట్రాల్లో యాక్టివ్‌గా ప్రచారం చేశారు. మనమంతా ఒకే దేశంలో ఉన్నప్పుడు ఒక రాష్ట్ర నేత పక్క రాష్ట్రానికి వెళ్లకూడదనే నిబంధన ఎక్కడైనా ఉందా? అని చంద్రబాబు నిలదీశారు. పవన్‌ను ప్రాంతం పేరుతో టార్గెట్ చేస్తున్న వారికి ఈ వ్యాఖ్యల ద్వారా ఆయన గట్టి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ నేతలు అనుసరిస్తున్న తీరుపై చంద్రబాబు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అసలు ఎందుకు ఇలా చేస్తున్నారో నాకైతే అర్థం కావడం లేదు.

రాజకీయాల్లో ఉంటే ప్రజలకు ఎవరు ఎక్కువ సేవ చేస్తారు, ఎవరు ఎంత బాగా అభివృద్ధి చేస్తారనే విషయంలో పార్టీలు పోటీ పడాలి. అంతే తప్ప, ప్రజల మధ్య లేనిపోని ప్రాంతీయ విద్వేషాలను రగిల్చి రాజకీయం చేయాలని చూడటం సరైన పద్ధతి కాదు అని హితవు పలికారు.

ప్రజల మధ్య గోడలు కట్టాలని చూసే ప్రయత్నాలను నాయకులు మానుకోవాలని సూచించారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి 12 సంవత్సరాలు గడిచిపోయిన తర్వాత కూడా.. ఇంకా పాత ఆంధ్రా-తెలంగాణ సెంటిమెంట్‌ను రగిల్చే ప్రయత్నం చేయడంపై చంద్రబాబు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక స్థిరమైన రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడి, ఇరు రాష్ట్రాల మధ్య సామరస్యపూర్వక వాతావరణం నెలకొంటున్న తరుణంలో.. మళ్లీ పాత వివాదాలను తవ్వి తీయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. రాజకీయాల కోసం పాత సెంటిమెంట్ల ముసుగులోకి వెళ్లడం నాయకుల బలహీనతకు నిదర్శనమన్నారు.

తెలంగాణ సమాజం అత్యంత చైతన్యవంతమైనదని, ఇక్కడ ఎవరు ఎలాంటి రాజకీయం చేస్తున్నారో ప్రజలందరికీ బాగా తెలుసని చంద్రబాబు వ్యాఖ్యానించారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఎవరి పాత్ర ఎంత ఉందో, ఉమ్మడి రాష్ట్రంలో, విభజన తర్వాత ఎవరు ఏ రకమైన సేవలందించారో ప్రజల మనసుల్లో స్పష్టంగా ఉందన్నారు. కాబట్టి ఓట్ల కోసం, పబ్లిసిటీ కోసం పవన్ కల్యాణ్ లాంటి నేతలను టార్గెట్ చేస్తూ ఇరుకైన రాజకీయాలు చేయడం ఎవరికీ మంచిది కాదని చంద్రబాబు బుధవారం స్పష్టం చేశారు.

# ఖాదిర్ అలీ బేగ్ వారసత్వం కళాజగత్తుకు స్ఫూర్తి: గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా



హైదరాబాద్, జూన్ 3 ,2026: భారతీయ నాటకరంగానికి విశిష్ట సేవలందించిన దివంగత ఖాదిర్ అలీ బేగ్ వారసత్వం నేటికీ కళాజగత్తుకు స్ఫూర్తిగా నిలుస్తోందని తెలంగాణ గవర్నర్ శ్రీ శివ్ ప్రతాప్ శుక్లా అన్నారు.

తారామతి బారాదరి ఆడిటోరియం లో బుధవారం సాయంత్రం

ఖాదిర్ అలీ బేగ్ థియేటర్ ఫౌండేషన్ , తెలంగాణ పర్యాటక శాఖ సహకారంతో ఏర్పాటు చేసిన 'చాంద్ తారా...

దిలెజెండ్ ఆఫ్ తారామతి ' చిత్ర ట్రైలర్ విడుదల కార్యక్రమంకు గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గవర్నర్

ట్రైలర్ ను రిలీజ్ చేసి తిలకించారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.....

ఖాదిర్ అలీ బేగ్ నాటకరంగాన్ని కేవలం వినోద సాధనంగా కాకుండా సమాజం, సంస్కృతి, చరిత్రల మధ్య సంభాషణకు వేదికగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ఆయన కళాత్మక దృష్టి, సృజనాత్మకత అనేక మంది కళాకారులకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు.

పద్మశ్రీ మహమ్మద్ అలీ బేగ్ నాయకత్వంలోని ఖాదిర్ అలీ బేగ్ థియేటర్ ఫౌండేషన్ ఈ సాంస్కృతిక వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తోందని గవర్నర్ అభినందించారు. యువ కళాకారులను ప్రోత్సహించడంతో పాటు నాటక సంప్రదాయాల పరిరక్షణలో ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

'చాంద్ తారా' చిత్ర ట్రైలర్ విడుదలను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, ఇది కేవలం సినీ కార్యక్రమం మాత్రమే కాదని, హైదరాబాద్‌కు చెందిన గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే ప్రయత్నమని అన్నారు. దక్కనీ సంస్కృతి, సంగీతం, కళలతో ముడిపడిన తారామతి జీవితం ఆధారంగా రూపొందిన ఈ చిత్రం కొత్త తరానికి చారిత్రక, సాంస్కృతిక విలువలను పరిచయం చేస్తుందని పేర్కొన్నారు.

అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'చాంద్ తారా' ట్రైలర్ ప్రదర్శించబడటం తెలంగాణ సాంస్కృతిక వైభవానికి దక్కిన గౌరవమని గవర్నర్ అన్నారు. ఈ చిత్రం దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకాదరణ పొందడంతో పాటు మన సాంస్కృతిక వారసత్వాన్ని మరింత విస్తృతంగా చాటిచెబుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# మాస్కోలో రష్యా స్బేర్‌బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్‌తో మంత్రి లోకేష్ భేటీ

విజయవాడ జూన్ 3 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ రష్యా పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రభుత్వ నియంత్రణలోని అతిపెద్ద రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్బేర్‌బ్యాంక్‌తో కీలక చర్చలు జరిపారు. మాస్కోలో స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్‌తో భేటీ అయిన లోకేష్, భారత్‌లో బ్యాంకింగ్, టెక్నాలజీ, స్మార్ట్ సిటీ రంగాలలో సహకారానికి సంబంధించి పలు ముఖ్యమైన ప్రతిపాదనలు చేశారు.ఈ సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ... స్బేర్‌బ్యాంక్ అభివృద్ధి చేసిన 'గిగాచాట్ ఎల్ఎల్ఎం'ను భారత బ్యాంకింగ్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రిటైల్ రంగాలకు విస్తరించాలని కోరారు. పాశ్చాత్య ప్లాట్‌ఫారమ్‌లకు ఇది ఒక సురక్షితమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశంలోని యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) నెట్‌వర్క్ భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు, స్బేర్‌బ్యాంక్ యొక్క అత్యాధునిక వాయిస్ రికగ్నిషన్, బయోమెట్రిక్ యాంటీ-ఫ్రాడ్ నెట్‌వర్క్‌ను భారత బ్యాంకింగ్ వ్యవస్థలో ఇంటిగ్రేట్ చేయడానికి సాంకేతిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.భారత్‌లో కొనసాగుతున్న స్మార్ట్ సిటీ మిషన్‌లో భాగంగా మున్సిపల్ కార్యకలాపాలను మెరుగుపరచడానికి స్బేర్‌బ్యాంక్ ప్రిడిక్టివ్ అనలిటిక్స్, స్మార్ట్ ట్రాన్సిట్ సర్వైలెన్స్ వంటి డిజిటల్ పరిష్కారాలను అందించాలని లోకేష్ సూచించారు. ప్రపంచస్థాయి సాఫ్ట్‌వేర్, ఏఐ ఇంజనీర్లను వేగంగా తీర్చిదిద్దేందుకు స్బేర్‌బ్యాంక్ యొక్క ప్రత్యేక శిక్షణా విధానమైన 'స్కూల్ 21' కోడింగ్ అకాడమీలను భారత్‌లోని ప్రధాన విద్యా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యంగా, వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలోని ఫార్మా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిదారుల సౌలభ్యం కోసం రూపాయి-రూబుల్ వాణిజ్యానికి అనుమతులు ఇవ్వడంతో పాటు, వ్యవస్థీకృత రుణాలు అందించాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారుమంత్రి లోకేష్ ప్రతిపాదనలపై స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో తమ కార్యకలాపాలను వివరిస్తూ, న్యూఢిల్లీలోని కార్యాలయం ద్వారా ద్వైపాక్షిక వాణిజ్య ఫైనాన్స్, కార్పొరేట్ బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. బెంగళూరులోని తమ ఐటీ హబ్, రూపాయి-రూబుల్ వాణిజ్య లావాదేవీలకు సమన్వయ కేంద్రంగా పనిచేస్తోందని చెప్పారు. న్యూఢిల్లీ, ముంబైలోని తమ శాఖలు వ్యూహాత్మక వాణిజ్య కారిడార్లలో మౌలిక సదుపాయాల పెట్టుబడులకు గేట్‌వేలుగా ఉన్నాయని వివరించారు. మంత్రి లోకేష్ చేసిన ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించి, సానుకూల నిర్ణయం తీసుకుంటామని యెఫిమోవ్ హామీ ఇచ్చారు.మాస్కో కేంద్రంగా పనిచేస్తున్న స్బేర్‌బ్యాంక్, రిటైల్ బ్యాంకింగ్‌తో పాటు క్లౌడ్ సేవలు, కృత్రిమ మేధ (ఏఐ) రంగాల్లో విస్తరించిన భారీ సంస్థ. ప్రపంచవ్యాప్తంగా 11 కోట్లకు పైగా రిటైల్, 35 లక్షల కార్పొరేట్ ఖాతాదారులను కలిగి ఉన్న ఈ బ్యాంకు, 12,000 శాఖలతో ప్రతిరోజూ 8 కోట్ల మంది డిజిటల్ వినియోగదారులకు సేవలందిస్తోంది.

# పంచాయితీల తర్వాతే మున్సిపాల్టీలు

విశాఖపట్టణం, జూన్ 3, ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. పంచాయితీతోపాటు మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే పంచాయతీల పాలకవర్గం ముగిసింది. కొత్తగా ప్రత్యేక అధికారులను కూడా నియమించారు. మున్సిపాలిటీలకు సైతం ఆర్డీవో స్థాయి అధికారులు ప్రత్యేక అధికారులుగా వచ్చారు. అయితే ముందుగా పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. రెండేళ్ల పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని కూటమి భావిస్తోంది. ఎన్నికల నిర్వహణకు ఇదే సమయం అని అంచనా వేస్తోంది. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం స్థానిక ఎన్నికలకు సిద్ధపడుతోంది. ప్రతిచోట వైసీపీ అభ్యర్థి బరిలో ఉండాల్సిందేనని.. లేకుంటే మాత్రం వైసిపి ఇన్చార్జ్ పై వేటు వేస్తామని జగన్మోహన్ రెడ్డి హెచ్చరించారు. మరోవైపు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తమ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిస్తున్నారు.కూటమి ప్రభుత్వపరంగా ఈనెల కీలకం. ముఖ్యంగా ఇదే నెలలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మత్స్యకారుల భరోసా వంటి పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేయనుంది. దీంతో ప్రజల్లో సంతృప్తి శాతం పెరుగుతుందని అంచనా వేస్తోంది. మరోవైపు కొత్త పింఛన్లకు సంబంధించిన బిగ్ అప్డేట్ వచ్చింది. సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం నడుస్తోంది. కొత్త పింఛన్లు మంజూరు చేసి.. ప్రజల్లో మరింత సంతృప్తి సాధించి.. ఎన్నికలకు వెళ్లాలన్న ఆలోచనలో కూటమి ఉంది. అయితే జూలై నుంచి స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది.ముందుగా పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 13 వేలకు పైగా పంచాయతీలు ఉన్నాయి. వీటికి ఏప్రిల్ నాలుగు తో పదవీకాలం గడువు ముగిసింది. అప్పటినుంచి ప్రత్యేక అధికారులను నియమించారు. మరోవైపు ఏప్రిల్ నుంచి 16వ ఆర్థిక సంఘం గడువు ప్రారంభం అయింది. పంచాయితీలకు పాలకవర్గాలు ఉంటేనే ఆర్థిక సంఘం నిధులు దక్కేవి. అందుకే ముందుగా పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం సూత్రప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. వీలైనంతవరకు పంచాయితీలను ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నాలు చేసే అవకాశం కనిపిస్తోంది. కానీ ఎట్టి పరిస్థితుల్లో ఏకగ్రీవాలకు ఒప్పుకోవద్దు అని జగన్మోహన్ రెడ్డి గట్టిగానే చెప్పారు. అయితే క్యాడర్ మాత్రం విముఖత వ్యక్తం చేస్తోంది. స్థానిక ఎన్నికలు అంటేనే అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయి. పైగా ఆర్థిక భారం తప్పేలా లేదు. కానీ అధినేత జగన్మోహన్ రెడ్డి వైఖరి చూస్తుంటే తప్పనిసరిగా బరిలో ఉండాల్సిందేనని చెబుతున్నారు. కానీ పార్టీ శ్రేణులు మాత్రం పులివెందుల జడ్పిటిసి ఎన్నికలను గుర్తుచేసుకొని భయపడుతున్నారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా 110 కి పైగా మున్సిపాలిటీలు, 12 కార్పొరేషన్లు ఉన్నాయి. పట్టణాలతో పాటు నగరాల్లో కూటమికి సంతృప్తికర వాతావరణముంది. పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతుండడంతో అక్కడి ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అక్కడ కూడా కూటమి సత్తా చాటాలని చూస్తోంది. కానీ ఎట్టి పరిస్థితుల్లో ఏకగ్రీవాలు కాకుండా పోటీ చేయించాలన్న ఆలోచనలో వైసిపి ఉంది. కానీ వైసీపీ క్యాడర్ మాత్రం అందుకు సుముఖంగా లేదు. కానీ అధినేత జగన్మోహన్ రెడ్డి పట్టుబడుతుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోటీ చేయాల్సి ఉంటుంది.

పార్టీ కోసం కష్టపడిన వారికే టికెట్లు..!

ఇటు పార్టీ అగ్రనేతల కామెంట్స్..మరోవైపు ఎస్ఈసీ డెవలప్మెంట్స్‌తో..ఏపీలో స్థానిక ఎన్నికల సందడి ఊపందుకుంటోంది. ప్రధాన పార్టీలు క్షేత్రస్థాయి పర్యటనలకు సిద్ధమవుతున్నాయి. పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉండటంతో టీడీపీ ఈ ఎలక్షన్స్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు గెలుచుకున్న స్థానాలను తిరిగి కైవసం చేసుకుని పసుపు జెండా రెపరెపలాడించాలని పట్టుదలతో ఉంది. మహానాడు వేదికపైనా స్థానిక ఎన్నికలపై చర్చ జరిగింది. పార్టీ జెండా మోసిన వారికి పోటీ అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేలకు ఆదేశాలు వెళ్లాయంటున్నారు.పార్టీ కోసం కష్టపడిన వారికి కచ్చితంగా టికెట్లు ఇస్తామని సీఎం చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని సంకేతాలిచ్చారాయన. ఇక ఇదే సందర్భంలో మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ కూడా స్థానిక ఎన్నికలపై గురిపెట్టారు. ఏకగ్రీవాలు కాకుండా చూడాలని, ప్రతి స్థానంలోనూ పోటీ ఉండేలా అభ్యర్థులను ఇప్పటినుంచే రెడీ చేయాలని లీడర్లకు సూచించారు. దీంతో ఒక్కసారిగా ఏపీలో పొలిటికల్ హీట్ కాక రేక రేపుతోంది.స్థానిక ఎన్నికల్లో టీడీపీ, వైసీపీల మధ్యే గట్టి పోటీ ఉండే పరిస్థితి కనిపిస్తోంది. కూటమిలో జనసేన, బీజేపీకి సీట్లు కేటాయించిన చోట..పరిస్థితులు తమకు అనుకూలంగా ఉంటాయని వైసీపీ భావిస్తోంది.

2021-22లో జరిగిన ఎన్నికల్లో అప్పటి అధికార పార్టీ వైసీపీ రాష్ట్ర వ్యాప్తంగా 80 శాతం స్థానాలను సొంతం చేసుకుంది. ప్రస్తుత ఎన్నికల్లో 100 శాతం స్థానాలను గెలుచుకోవాలని టీడీపీ యోచిస్తోంది. వైసీపీపై రాజకీయ ప్రతీకారం తీర్చుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న జనసేన కూడా కీలక స్థానాల్లో పోటీ చేసే యోచనలో ఉంది. ఆయా జిల్లాల నుంచి ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలు కీలకమైన వార్డులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.మరోవైపు బీజేపీ కూడా తమకు బలం ఉన్నచోట అభ్యర్థులను పోటీలోకి దించేందుకు సిద్ధమవుతోంది. అయితే ఎన్నికలకు దూరంగా ఉండాలా..లేక పోటీ చేయాలా అనే డైలామాలో ఉన్న వైసీపీ ఇక అమీతుమీ తేల్చుకునేందుకు రెడీ అయినట్లు కనిపిస్తోంది. అధికార పక్షంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని భావిస్తున్న ఫ్యాన్ పార్టీ..స్థానిక ఎన్నికల్లో గెలుపు గుర్రాలను రంగంలోకి దించేందుకు సర్వం సిద్ధం చేస్తోందట. రాష్ట్రస్థాయి కీలక నేతల సమావేశంలో స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు జగన్. ముఖ్యంగా ఏకగ్రీవాలు కాకుండా చూడాలని, అలా జరిగితే నియోజకవర్గ ఇంచార్జ్‌ల ఫెయిల్యూర్‌గా భావించాల్సి వస్తుందని ముఖ్యనేతలను హెచ్చరించారు.

దీంతో స్థానిక పోరు విషయంలో తగ్గేదేలే అన్న ఇండికేషన్ పంపించారు వైసీపీ అధినేత జగన్.ఉమ్మడి 13 జిల్లాల పరిధిలో దాదాపు 13 వేల 326 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో కొన్నింటికి న్యాయపరమైన చిక్కుల కారణంగా గతంలో ఎన్నికలు నిర్వహించ లేదు. ఇప్పుడు అన్ని పంచాయతీలకు ఎలక్షన్స్ జరిపే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే 660 జడ్పీటీసీ స్థానాలు, 10వేల 47కి పైగా ఎంపీటీసీ స్థానాలకు ఎలక్షన్స్ పెట్టనుండటంతో పల్లెల్లో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కుతోంది.

అలాగే రాష్ట్రంలో 13 కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజన ప్రకారం 920కు వార్డుల సంఖ్య పెరిగింది.

75 మున్సిపాలిటీల పరిధిలో దాదాపు 2 వేలకు పైగా వార్డులు ఉన్నాయి. వీటన్నింటికీ కూడా రెండు విడతల్లో స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు స్టేట్ ఈసీ కసరత్తు చేస్తోంది.

# టీడీపికి కలిసి రాని రాజ్యసభ

విజయవాడ, జూన్ 3, తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ ఎన్నికల సందడి ఊపందుకుంది. రాష్ట్రంలో కూటమికి ఉన్న భారీ మెజారిటీ కారణంగా ఖాళీ అవుతున్న నాలుగు స్థానాలనూ కైవసం చేసుకోవడం నల్లేరుపై నడకే. అయితే, ఈ విజయోత్సాహం నడుమ పార్టీలో ఒక ఆసక్తికరమైన, పాత వివాదం మళ్ళీ తెరపైకి వచ్చింది. 1984 లో ఎన్టీఆర్ కాలం నుంచి నేటి వరకు పెద్దల సభకు వెళ్లిన నేతల చరిత్రను గమనిస్తే.. రాజ్యసభ సభ్యులు టీడీపీకి ఎప్పుడూ కలిసి రాలేదు అనే సెంటిమెంట్ క్యాడర్‌లో బలంగా వినిపిస్తోంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత ఇప్పటివరకు దాదాపు 46 మంది నేతలు ఆ పార్టీ తరపున రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. అయితే ఈ సుదీర్ఘ చరిత్రలో ఒక చేదు నిజం పార్టీని నిరంతరం వెంటాడుతోంది.

టీడీపీ తరఫున ఒకసారి కంటే ఎక్కువసార్లు రాజ్యసభకు వెళ్లిన నేతలలో అత్యధికులు కీలక సమయంలో పార్టీకి హ్యాండ్ ఇచ్చి వలస బాట పట్టారు. నాడు ఎన్టీఆర్ హయాంలో పార్టీలో అత్యంత కీలక చక్రం తిప్పిన పి. ఉపేంద్ర కాలం నుంచి.. నిన్నమొన్నటి సుజనా చౌదరి, సీఎం రమేష్ వరకు ఈ జాబితా చాలా పెద్దదిగానే ఉంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలవాల్సిన ఈ పెద్దలు .. సొంత ప్రయోజనాల కోసం లేదా కేసుల భయంతో పార్టీ లైన్ దాటడం ప్రతిసారీ క్యాడర్‌ను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది.టీడీపీ చరిత్రలోనే అత్యంత ఘోరమైన పరాజయాన్ని మూటగట్టుకున్న 2019 ఎన్నికల తర్వాత ఈ రాజ్యసభ సభ్యుల వలసలు పరాకాష్టకు చేరాయి. అప్పట్లో టీడీపీకి ఉన్న ఆరుగురు రాజ్యసభ సభ్యుల్లో నలుగురు సుజనా చౌదరి, సి.ఎం. రమేష్, టి.జి. వెంకటేష్, గరికపాటి మోహన్ రావు ఒకేసారి గ్రూప్‌గా మారి, రాజ్యసభలో టీడీపీ పక్షాన్ని ఏకంగా బీజేపీలో విలీనం చేసేశారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం రెండు పైగా మూడు వంతుల మెజారిటీని వాడుకుని, అనర్హత వేటు పడకుండా వీరు సేఫ్‌గా కమలం గూటికి చేరిపోయారు. అంతకుముందు చంద్రబాబుకు అత్యంత నమ్మకస్తులుగా, ఢిల్లీలో పార్టీ ముఖచిత్రాలుగా వెలిగిన వీరే.. పార్టీ ఓడిపోగానే పక్కదారి పట్టడం చంద్రబాబు రాజకీయ వ్యూహాల లోపాన్ని ఎత్తిచూపింది.ఈ వరుస వలసల వెనుక ఉన్న అసలు కారణంపై టీడీపీ క్షేత్రస్థాయి క్యాడర్, సీనియర్ లీడర్లలో తీవ్రమైన అసంతృప్తి ఉంది. ఎలక్షన్ల సమయంలో పార్టీ గెలుపు కోసం రాత్రింబవళ్లు లాఠీ దెబ్బలు తింటూ, జైళ్లకు వెళ్లే గ్రౌండ్ లెవెల్ లీడర్లను పక్కన పెట్టి.. కేవలం ఫండింగ్ చేసేవారికి, తెర వెనుక చక్రం తిప్పే కార్పొరేట్ శక్తులకే చంద్రబాబు రాజ్యసభ సీట్లు ఇస్తారనే విమర్శ మొదటి నుండి ఉంది. ఢిల్లీలో లాలీచీలు నడపడానికి, వ్యాపార ప్రయోజనాలు కాపాడుకోవడానికి వచ్చే ఇలాంటి పారాచూట్ నేతలకు పార్టీ సిద్ధాంతాల పట్ల గానీ, కార్యకర్తల కష్టం పట్ల గానీ ఎలాంటి నిబద్ధత ఉండదు. అందుకే, అధికారం మారగానే వీరు తమ వ్యాపారాలను, కాంట్రాక్టులను కాపాడుకోవడానికి అధికార పార్టీలోకి జంప్ అయిపోతుంటారని క్యాడర్ గట్టిగా నమ్ముతోంది.ప్రస్తుతం జూన్ 2026 లో ఖాళీ అవుతున్న నాలుగు రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో మళ్లీ లాబీయింగ్ మొదలైంది. కూటమి ఒప్పందంలో భాగంగా జనసేనకు ఒక సీటు కేటాయించగా, మిగిలిన మూడు సీట్లు టీడీపీ దక్కించుకోనుంది. ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీగా ఉన్న సానా సతీష్ బాబు తో పాటు పాత కార్పొరేట్ ముఖాలు మళ్లీ సీట్ల కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే, ఈసారి నారా లోకేష్ నేతృత్వంలో అభ్యర్థుల ఎంపిక జరుగుతుండటంతో.. యువతకు, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న బీసీ, ఎస్సీ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలని, పాత తప్పులను పునరావృతం చేయవద్దని కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేస్తున్నారు.ఒక ప్రాంతీయ పార్టీ జాతీయ స్థాయిలో తన వాయిస్ బలంగా వినిపించాలంటే రాజ్యసభ సభ్యుల పాత్ర కీలకం. కానీ టీడీపీ విషయంలో ఈ సభ్యులు కేవలం పవర్ బ్రోకర్లు గా మిగిలిపోతున్నారనేది నిజం. సురేష్ ప్రభు లాంటి బయటి వ్యక్తులకు కూడా గతంలో టీడీపీ సీటు ఇచ్చింది. ఈ ధోరణి మారకపోతే, భవిష్యత్తులో కూడా ఈ సీట్లు పార్టీకి కేవలం తాత్కాలిక అవసరాలకే ఉపయోగపడతాయి తప్ప, నమ్మకమైన లీడర్‌షిప్‌ను తయారు చేయలేవు.

చంద్రబాబు నాయుడు ఈ ఎన్నికల్లో కేవలం ఆర్థిక అంగబలాన్ని మాత్రమే చూడకుండా, రాజకీయ అంగబలం, నమ్మకమైన చరిత్ర ఉన్నవారికే పెద్దల సభకు పంపితేనే ఈ రాజ్యసభ శాపం నుంచి టీడీపీ బయటపడగలదని టీడీపీ క్యాడర్ అభిప్రాయం.

## ఘోర ప్రమాదం.. రెండు బస్సులు ఢీకొని ఏడుగురు మృతి



సూరత్: గుజరాత్లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సూరత్ జిల్లా బర్డోలి ప్రాంతంలో రెండు బస్సులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందగా.. 10 మందికిపైగా గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. మంగళవారం రాత్రి మహారాష్ట్రకు చెందిన బస్సు.. బర్డోలి వద్ద ట్యాంకర్ను తప్పించబోయి అదుపుతప్పి డివైడర్ను దాటి ఎదురుగా వస్తున్న మరో బస్సును ఢీకొట్టింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

# టార్గెట్ 100

## జగన నయా లెక్కలు

విజయవాడ, జూన్ 3, రాజకీయాల్లో పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు మారడం సహజం. అయితే భారీ విజయాలను లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళ్లిన పార్టీలు అనూహ్య ఫలితాలు ఎదుర్కొన్నప్పుడు తమ కార్యాచరణను తిరిగి సమీక్షించుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కూడా ఇలాంటి చర్చలే జరుగుతున్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల సమయంలో వై నాట్ 175 అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేసిన పార్టీ, ఎన్నికల ఫలితాల్లో కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితం కావడంతో భవిష్యత్ వ్యూహాలపై అంతర్గతంగా మంతనాలు ప్రారంభమైనట్లు సమాచారం.ఇటీవల నిర్వహించిన పార్టీ సమావేశాల్లో నాయకుల మధ్య కొత్త ఎన్నికల లక్ష్యాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. గతంలో అత్యంత భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం వల్ల క్షేత్రస్థాయిలో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని కొందరు అభిప్రాయపడ్డారు. అందువల్ల వచ్చే ఎన్నికల్లో వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పరిమిత లక్ష్యంతో ముందుకు సాగాలని సూచనలు వచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.కొంతమంది నాయకులు 175 స్థానాలపై దృష్టి కేంద్రీకరించడం కంటే, గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న సుమారు 100 నియోజకవర్గాలను గుర్తించి ప్రత్యేక వ్యూహంతో పని చేయాలని అభిప్రాయపడినట్లు సమాచారం. బలమైన స్థానాల్లో పార్టీ శక్తిని కేంద్రీకరించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని వారు వివరించినట్లు తెలుస్తోంది.అలాగే ఆయా నియోజకవర్గాల్లో స్థానిక నాయకత్వాన్ని మరింత చురుకుగా మార్చడం, కార్యకర్తలను సమన్వయం చేయడం, ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం వంటి అంశాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. గత ఎన్నికల అనుభవాల ఆధారంగా బలహీనతలను గుర్తించి వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం అవసరమని నాయకులు అభిప్రాయపడ్డారని చెబుతున్నారు. పార్టీ అధ్యక్షుడు జగన్ తుది నిర్ణయం తీసుకునే వరకు ఈ అంశంపై అధికారిక స్పష్టత వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపైనే ప్రధాన దృష్టి పెట్టాలని నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం.ఇక పార్టీ సీనియర్ నేత సజ్జల రామకృష్ణ రెడ్డిసమావేశంలో లక్ష్యాల సంఖ్యను తగ్గించుకోవడంపై కాకుండా గెలుపు అవకాశాలను పెంచే మార్గాలపై దృష్టి పెట్టాలని సూచించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎన్నికల్లో విజయం సాధించాలంటే ప్రజల మద్దతు, సమర్థవంతమైన ప్రచారం కీలకమని ఆయన అభిప్రాయపడ్డారని సమాచారం.మరోవైపు రానున్న కాలంలో నిర్వహించే ప్రజా కార్యక్రమాలు, ముఖ్యంగా పార్టీ అధినేత చేపట్టనున్న పాదయాత్ర తర్వాత రాజకీయ పరిస్థితులను అంచనా వేసి తుది వ్యూహాన్ని ఖరారు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అప్పటి వరకు అన్ని నియోజకవర్గాల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పార్టీ పెద్దలు సూచించినట్లు సమాచారం. ఎన్నికల లక్ష్యాల కంటే ప్రజల్లో మళ్లీ విశ్వాసాన్ని పెంపొందించుకోవడంపైనే ప్రస్తుతం పార్టీ ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

## కమలానికి ఏమైంది...

నెల్లూరు, జూన్ 3 ఏపీలో బిజెపి ప్రక్షాళన దిశగా హై కమాండ్ అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ పార్టీ నేతల వ్యవహార శైలిపై ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. పార్టీ అభివృద్ధిపై నేతలు పెద్దగా దృష్టి పెట్టడం లేదు. పైగా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు ఉన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. పార్టీని బలోపేతం చేయడం లేదు. దీనిపై హై కమాండ్ కు స్పష్టమైన సమాచారం ఉంది. అందుకే నేతల తీరుపై పెద్దలు ఆగ్రహంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఓ ముఖ్యమైన నేతను పిలిచి గట్టిగానే క్లాసు పీకినట్లు తెలుస్తోంది. సదరు నాయకుడి ఎదుట నేతల పనితీరు, వ్యవహార శైలి బయట పెట్టినట్లు సమాచారం. అందుకే మొత్తం మార్పు దిశగా అడుగులు వేస్తామని హెచ్చరించినట్లు తెలుస్తోంది.ఏపీలో భారతీయ జనతా పార్టీ కనీసం సొంతంగా ఉనికి చాటుకునే పరిస్థితిలో లేదు. తెలుగుదేశం పార్టీతో కలిసిన సమయంలో మాత్రమే ఓట్లతో పాటు సీట్లు పెరుగుతున్నాయి. ఒంటరిగా పోరాటం చేస్తున్న ప్రతిసారి ఒక్క నియోజకవర్గంలో కూడా డిపాజిట్లు రావడం లేదు. 2014లో టిడిపి తో కలిసి పోటీ చేస్తే ఎమ్మెల్యే తో పాటు ఎంపీ స్థానాలను దక్కించుకుంది బిజెపి. మొన్నటి ఎన్నికల్లో పొత్తులో భాగంగా ఎనిమిది ఎమ్మెల్యేలతో పాటు రెండు పార్లమెంట్ స్థానాలు ఆ పార్టీకి దక్కాయి. అయితే ఇప్పుడు కూడా ఎంపీలతో పాటు ఎమ్మెల్యేలు ఎవరికి వారుగా వ్యవహరిస్తున్నారు. కనీసం పార్టీ కోసం పట్టించుకునే వారు కరువవుతున్నారుబిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితుడైన పివిఎన్ మాధవ్ పార్టీని అభివృద్ధి చేస్తారని హైకమాండ్ భావించింది. ఆయనపై చాలా రకాలుగా అంచనాలు పెట్టుకుంది. కానీ ఎందుకో ఆయన ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదు. ప్రారంభంలో హడావిడి చేశారు. తరువాత ప్రెస్ మీట్ లకే పరిమితం అవుతున్నారు. దీంతో పార్టీ శ్రేణులకు అందుబాటులో లేరన్న విమర్శలు ఉన్నాయి. పార్టీకి పెద్దదిక్కుగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అన్నారు. ఆయనకు ఢిల్లీలో పరపతి ఉంది. సీఎం చంద్రబాబు వద్ద గౌరవం ఉంది. అందుకే ఆయన కేంద్ర ప్రభుత్వపరంగా, రాష్ట్ర ప్రభుత్వపరంగా పనులు చేసుకుంటున్నారు. స్థానికంగా పార్టీ శ్రేణులకు అందుబాటులో లేరన్న విమర్శ ఉంది. దగ్గుబాటి పురందేశ్వరి పరిస్థితి కూడా అదే. మొన్నటి ఎన్నికల వరకు ఆమె బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలుగా ఉండేవారు. ఇప్పుడు రాజమండ్రి ఎంపీగా కూడా ఉన్నారు. కనీసం వారంలో ఒక్కరోజు కూడా ఆమె అందుబాటులో ఉండడం లేదు. ఆమె తరుపున కూడా ఎవరు లేకుండా పోయారు పార్లమెంట్ నియోజకవర్గంలో. ఇవన్నీ పార్టీ దృష్టికి వెళ్లాయి కూడా.. అందుకే హై కమాండ్ ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. మూడు పార్టీలు కలిసి వెళ్తాయి. కానీ క్షేత్రస్థాయిలో భారతీయ జనతా పార్టీకి బలం లేదు. ఆ బలం పెంచుకునే ప్రయత్నం కూడా జరగలేదు. జిల్లా కమిటీలు ఉన్నాయంటే ఉన్నాయి. కనీసం గ్రామస్థాయి కమిటీలు లేవు. మండల కమిటీలు కానరావు. నియోజకవర్గాలు ఇన్చార్జులు ఉన్న ఫలితం లేదు. వాస్తవానికి భారతీయ జనతా పార్టీ ఇతర రాష్ట్రాల్లో బూత్ లెవెల్ లో బలమైన కమిటీలు ఉంటాయి. కానీ ఏపీ విషయానికి వచ్చినప్పుడు అటువంటి పరిస్థితి లేదు. ఇలానే కొనసాగితే ఏపీ బీజేపీలో ప్రక్షాళనకు హైకమాండ్ ప్రయత్నించే అవకాశం ఉంది. కచ్చితంగా చాలా రకాల మార్పులకు ఆ పార్టీ పెద్దలు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# మాకో అవకాశం ఇవ్వండి

విజయవాడ, జూన్ 3, తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ పదవులపై చాలా మంది ఆశలు పెట్టుకున్నారు. అందులో సీనియర్ నేతలు ఎక్కువ మంది ఈ పదవిని ఆశిస్తున్నారు. కానీ పదవులు తక్కువ.. ఆశావహులు ఎక్కువగా ఉన్నారు. ఇది టీడీపీ నాయకత్వానికి కొంత ఇబ్బందిగా మారే అవకాశముంది. తాము పార్టీ కోసం పడిన కష్టాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ ను కలిసి తమ వినతులను సమర్పించారు. తమకు పెద్దల సభలో అవకాశం కల్పించాలని కోరుతున్నారు. కానీ నాయకత్వం మాత్రం రాజ్యసభ స్థానాల విషయంలో ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి వచ్చింది.వర్ల రామయ్య, యనమల రామకృష్ణుడు, కంభంపాటి రామ్మోహన్ రావు వంటి నేతలు తమకు రాజ్యసభ పదవి ఇవ్వాలని కోరుతున్నారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కూడా కీలక కామెంట్స్ చేశారు. తన తర్వాత తన కుటుంబానికి కూడా రాజకీయంగా సేవ చేసే అవకాశం ఇవ్వాలని అయ్యన్న పాత్రుడు కోరారు. ఇరవై ఐదేళ్ల వయస్సు నుంచి టీడీపీలో సేవలందిస్తున్నానన్న ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు తన కుటుంబానికి కూడా అవకాశం కల్పించాలని కోరారు. అంటే పరోక్షంగా తన కుమారుడు చింతకాయల విజయ్ ను రాజ్యసభకు పంపాలని కోరినట్లు నాయకత్వానికి చెప్పకనే చెప్పినట్లయింది.తెలుగుదేశం పార్టీ కోసం జీవితాంతం పనిచేశానని అయ్యన్న పాత్రుడు భావోద్వేగంగా మాట్లాడారు. తన కుటుంబ సభ్యులకు కూడా పార్టీకి సేవ చేసే అవకాశం కల్పించాలని కోరిన స్పీకర్ అయ్యన్న అందుకు అవకాశమివ్వాలని పార్టీ నాయకత్వాన్ని కోరారు. త్వరలో రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులను ఎంపిక చేస్తున్న సమయంలో అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలకు రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. టీడీపీలో రాజ్యసభ ఆశావహుల మధ్య అయ్యన్న పాత్రుడి వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. మరి రాజ్యసభకు టీడీపీ నాయకత్వం ఎవరిని ఎంపిక చేస్తుందన్నది మాత్రం చివరి వరకూ సస్పెన్స్ గా కొనసాగే అవకాశముంది.

# షర్మిళకు హ్యాండేనా..



కడప, జూన్ 3, వైఎస్ షర్మిలకు రాజ్యసభ స్థానం దక్కుతుందా? అదీ కర్ణాటక నుంచి. అది సాధ్యమయ్యే పనేనా? కర్ణాటక కాంగ్రెస్ స్థానిక నేతలు ఇందుకు అంగీకరిస్తారా? అన్నది ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసి వచ్చిన వైఎస్ షర్మిల కొంత ఉత్సాహంతో కనిపించారు. అయితే సమావేశంలో ఏం జరిగిందో తెలియదు కానీ, వైఎస్ షర్మిలకు కర్ణాటక నుంచి రాజ్యసభ పదవి దక్కుతుందని మాత్రం జోరుగా ప్రచారం అయితే జరుగుతుంది. తెలంగాణ ఎన్నికల సందర్భంగా తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేయడంతో షర్మిలకు రెండు హామీలు లభించాయి. ఒకటి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ గా నియమించడం, రెండోది రాజ్యసభ పదవి ఇవ్వడం. ఈ రెండు హామీలను నెరవేరుస్తామని చెప్పింది.తెలంగాణ వ్యవసాయం

ఇందులో ఏపీసీసీ చీఫ్ గా షర్మిలను నియమించారు. ఒక హామీ నెరవేరింది. కానీ రెండేళ్ల నుంచి మరొక హామీ మాత్రం నెరవేరలేదు. ఆ హామీని త్వరలో కర్ణాటకకు ముఖ్యమంత్రి కాబోతున్న డీకే శివకుమార్ ఇవ్వడంతో ఇప్పుడు ఆయనకు రాజకీయంగా ఇబ్బందిగా మారే అవకాశముంది. ఏపీలో కాంగ్రెస్ కు ఒక్కస్థానం కూడా లేకపోవడంతో తెలంగాణ, కర్ణాటకల నుంచి మాత్రమే వైఎస్ షర్మిలకు రాజ్యసభ పదవి ఇవ్వాల్సి ఉంటుంది. తెలంగాణ నుంచి ఇస్తే మళ్లీ సెంటిమెంట్ రాసుకుంటుందని భావించి కర్ణాటక నుంచి ఇవ్వాలని నిర్ణయించారు కానీ కర్ణాటకలో స్థానిక నేతల నుంచి ఈ ప్రతిపాదనకు వ్యతిరేకత వ్యక్తమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.డీకే శివకుమార్ కు ఇది బిగ్ టాస్క్ అని చెప్పాలి. ముఖ్యమంత్రి అయిన వెంటనే రాజ్యసభ అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. వైఎస్ షర్మిలను ఎంపిక చేస్తే స్థానిక కాంగ్రెస్ నేతల నుంచి డీకేకు వ్యతిరేకత మామూలుగా ఉండదు. లోకల్స్ కు ఇవ్వకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి ఎలా ఇస్తారన్న ప్రశ్న తలెత్తుంది. పైగా జాతీయ స్థాయి నేత అయితే ఓకే. కానీ పొరుగు రాష్ట్రంలోనేతకు ఎలా రాజ్యసభ పదవి ఇస్తారన్న ప్రశ్న ఖచ్చితంగా ఎదురవుతుంది. ఢిల్లీలో హైకమాండ్ ఇచ్చిన గ్యారంటీ కావడంతో అమలు చేస్తారా? లేదా? అన్నది ఇప్పుడు కర్ణాటక కాంగ్రెస్ అగ్రనేతలకు పెద్ద సమస్యగా మారింది. వైఎస్ షర్మిలకు రాజ్యసభ సీటు ఇచ్చినందువల్ల ఉపయోగం లేదు. అదే మరో రెండేళ్లలో కర్ణాటక ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఈ వివాదం ఊపందుకుంటే పార్టీకి ఇబ్బందికరంగా మారుతుందన్న కామెంట్స్ మాత్రం కన్నడ మీడియాలో జోరుగా కనిపిస్తున్నాయి.



## దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జి పైనుండి దూకి యువతి ఆత్మహత్య

హైదరాబాద్ దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి పైనుంచి దూకి యువతి ఆత్మహత్య చేసుకుంది. తమ కూతురు రోజా రమణి(26) కనిపించడంలేదని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. సీసీటీవీ పుటేజ్ ఆధారంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. నాగోల్ ప్రాంతంలో నివసిస్తూ మృతురాలు మెడికవర్ ఆసుపత్రిలో అకౌంటెంట్గా పని చేస్తుంది. లోన్ రికవరీ ఏజెంట్స్ వేదింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల అనుమానం.

# సీబీఎస్ఈ వివాదం.. రంగంలోకి కేంద్రం

న్యూఢల్లీ, జూన్ 3 (న్యూస్ పల్స్) సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్-స్క్రీన్ మార్కింగ్ రీవేల్యూషన్ ప్రక్రియలో లోపాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. బోర్డు ఛైర్మన్ రాహుల్ సింగ్, కార్యదర్శి హిమాంశు గుప్తాలనుబదిలీ చేసింది. వారి స్థానంలో కొత్త ఛైర్మన్గా లోఖండే ప్రశాంత్ సీతారామ్, కార్యదర్శిగా వరుణ్ భరద్వాజ్ను నియమించింది. అంతేకాదు,ఈ వివాదంపై విచారణకు కమిటీని నియమించింది. ఛైర్మన్ హోదాలో సీబీఎస్ఈ బోర్డు మొత్తం పనితీరు, పరిపాలన బాధ్యతలను రాహుల్ సింగ్ నిర్వర్తిస్తుండగా.. బోర్డుకు సంబంధించిన చట్టపరమైన అంశాలు, ఆడిట్, ప్రజా సంబంధాలు వంటి విభాగాలను హిమాంశు చూసుకుంటున్నారు.ఆన్-స్క్రీన్ మార్కింగ్ విధానం అమలు, విద్యార్థులు నుంచి వచ్చిన సమస్యలపై విచారణ జరిపేందుకు ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. సామర్థ్య నిర్మాణ కమిషన్ ఛైర్పర్సన్ ఎస్. రాధా చౌహాన్ ఈ ఏకసభ్య కమిటీకి అధ్యక్షత వహిస్తారు. ఈ కమిటీ తన నివేదికను నెలలోగా సిబ్బంది వ్యవహారాలు- శిక్షణ విభాగానికి సమర్పిస్తుంది. మరోవైపు, ఓఎస్ఎం అమలు, విద్యార్థులు నివేదించిన సమస్యలపై కమిటీ సభ్యులకు వివరించడానికి స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రెటరీ సంజయ్ కుమార్తో పాటు రాహుల్ సింగ్కు పార్లమెంటరీ ప్యానెల్ సమన్లు జారీ చేసింది.జవాబు పత్రాలు తారుమారు కావడం, మూల్యాంకనంలో తప్పులు, తప్పుడు దిశానిర్దేశం, తప్పుడు గ్రేడ్ల కేటాయింపు వంటి అనేక సమస్యలు ఉన్నాయి. స్కాన్ చేసిన కాపీల తమవి కావని కనుగొన్నారు. మూల్యాంకన ప్రక్రియలో సుమారు 20 జవాబు పత్రాల పొంతన లేనివిగా గుర్తించినట్లు సీబీఎస్ఈ అధికారులు అంగీకరించారు. వేదాంత్ అనే విద్యార్థి తన సమాధాన పత్రం కాదని, వేరే ఎవరో రాసిన పేపర్లు తనదాంటో కలిపేశారని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ వైరల్ అయ్యింది. దీంతో దేశవ్యాప్తంగా చాలా మంది విద్యార్థులు తమకూ ఇలాంటి అనుభవాలే ఎదురయ్యాయని వాపోయారు. ఈ వివాదంపై ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా స్పందిస్తూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

# కాంట్రవర్సీకి కేరాఫ్‌గా ఎమ్మెల్యే థామస్

## ఎస్సీ ఎమ్మెల్యేలకు గౌరవం లభించట్లేదని కామెంట్స్

తిరుపతి జూన్ 3,చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ రూటే సపరేటు. డాక్టర్ వృత్తిలో ఎప్పుడు బిజీగా ఉండే ఆయన అప్పుడప్పుడు హాట్ కామెంట్స్ చేసి న్యూస్ హెడ్‌లైన్‌గా మారుతున్నారు. ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గ ఎమ్మెల్యేలకు తగిన గౌరవం లభించడం లేదంటూ గతంలో ఆయన చేసిన కామెంట్స్ దుమారం లేపాయి. ఇదే విషయంపై పలుమార్లు తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా వ్యక్తం చేశారు కూడా. లేటెస్ట్‌గా మరోసారి షాకింగ్ కామెంట్స్ చేశారు ఎమ్మెల్యే థామస్.మీడియా సమావేశం సాక్షిగా వివాదాస్పద వ్యాఖ్యలు చేసి..సొంత ఎమ్మెల్యేలు, పార్టీ అధిష్టానం ఆగ్రహానికి గురయ్యారు. ఎస్సీ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో మట్టి అక్రమ రవాణతో సహా ఏ చిన్న ఘటన జరిగినా మీడియాలో హైలెట్ చేస్తారని..అదే అగ్రవర్ణ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఏం జరిగినా వాటిపై మీడియాలో కథనాలు రావడం లేదంటూ థామస్ చేసిన వ్యాఖ్యలు సెన్సేషన్‌గా మారాయి. అంతటితో ఆగకుండా ఆయన..పక్కనే ఉన్న చంద్రగిరి, నగరి నియోజకవర్గాల నుంచి మట్టి అక్రమంగా బయటకు వెళ్లడం లేదా? వాటిని ఎందుకు ఎవరూ పట్టించుకోవడం లేదంటూ..మరింత వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.ఈ మాటలు వైరల్ అయ్యాయి. ఆయన వ్యాఖ్యలు స్వతహాగానే చంద్రగిరి, నగరి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గాలి భానుప్రకాశ్‌లకు ఆగ్రహం తెప్పించినా..సొంత పార్టీ సహచర ఎమ్మెల్యే కావడంతో కౌంటర్ ఇవ్వకుండా మిన్నకుండిపోయారు. చివరకు థామస్ కామెంట్స్ పార్టీ అధిష్టానం చెవిన పడటంతో పార్టీ పెద్దలు సీరియస్ అయినట్లు తెలుస్తోంది. టీడీపీ స్టేట్ చీఫ్ పల్లా శ్రీనివాస్, థామస్‌ను సంజాయిషీ అడిగినట్లు తెలుస్తోంది. దీంతో పల్లా శ్రీనివాస్ ను కలిసి తాను చేసిన వ్యాఖ్యలపై థామస్ వివరణ ఇచ్చారు. తన మాటలను వక్రీకరించారని, ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు చేయబోనని చెప్పినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ విప్‌గాను కొనసాగుతున్న ఎమ్మెల్యే థామస్‌ను పార్టీ గట్టిగానే మందలించినట్లు చర్చించుకుంటున్నారు.జిల్లాకు చెందిన కొందరు టీడీపీ ఎమ్మెల్యేలు మాత్రం థామస్ తీరుపై కొంతకాలంగా గుర్రుగానే ఉన్నారట. ఎస్సీ ఎమ్మెల్యేలు, అగ్రవర్ణ ఎమ్మెల్యేలు అంటూ జిల్లాలో ఎమ్మెల్యేలను విడదీసే ప్రయత్నం చేస్తున్నారంటూ మండిపడుతున్నారట. తనపై ఆరోపణలు వస్తే వాటిని ఖండించాల్సింది పోయి..పక్క నియోజకవర్గ ఎమ్మెల్యేలకు బురద అంటించడం ఏంటని జిల్లా ఎమ్మెల్యేలు రగిలిపోతున్నారట.

గతంలోనూ ఆయన ఇదే తరహాలో వ్యాఖ్యలు చేశారని కూడా కొందరు ఎమ్మెల్యేలు గుర్తు చేస్తున్నారు. మరోసారి థామస్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఆయనకు గట్టిగానే కౌంటర్ ఇవ్వాలని ఒకరిద్దరు జిల్లా ఎమ్మెల్యేలు డిసైడ్ అయినట్లు టాక్.

## రోడ్డు ప్రమాదంలో డ్యాన్స్ మాస్టర్ పండుకు గాయాలు





విశాఖపట్నం లొడగలవానిపాలెం హైవేపై అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న రెండు వాహనాలను బొలెరో వ్యాన్ ఢీకొట్టింది. ఘటనలో డాన్స్ మాస్టర్ పండుకు రెండు కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. మరో ముగ్గురికి స్వల్ప గాయాలు కావడంతో అందరిని . ఆసుపత్రికి తరలించారు. నిద్రమత్తు, అతివేగమే ప్రమాదానికి కారణమని అనుమానం. పచ్చి కోళ్ల లోడ్తో వెళ్తున్న బొలెరో అదుపుతప్పి ప్రమాదం జరిగింది. పండు బృందం తగరపువలస ఉత్సవాల నుంచి తిరుగు ప్రయాణంలో ఘటన జరిగింది. పోలీసులు ప్రమాదానికి గురైన మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

# తిరుపతిలో వైసీపీ నేతలకు ముందస్తు నోటీసులు

తిరుపతి అలిపిరి వద్ద బలవంతంగా స్ట్రీట్ వ్యాపారులు తోపుడు బండ్లు తొలగించారంటు అలిపిరి - జూపార్క్ రోడ్ లో వీధి వ్యాపారులకు మద్దతుగా వైసీపీ నేత భూమన అభినయ్ రెడ్డి సంఘీభావం తెలిపారు. అధికార పార్టీ నేతల అప్రజాస్వామ్యం చర్యలపై అభినయ్ రెడ్డి నేతృత్వంలో అలిపిరి జూపార్క్ రోడ్ వ్యాపారులకు మద్దతుగా క్షేత్రస్థాయిలో పర్యటనచేయనున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పర్యటన అడ్డుకునేందుకు పోలీస్ 30 యాక్ట్ పేరుతో పోలీసులు ముందస్తు నోటీసులు ఇచచారు. వైసీపీ తిరుపతి టౌన్ అధ్యక్షుడు మల్లం రవి చంద్ర కు నోటీసులు ఇచ్చారు.

# బంగారం విక్రయిస్తున్న భారత్



ముంబై, జూన్ 3, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల మన ఇంధన దిగుమతుల బిల్లు భారీగా పెరిగింది. అలాగే ఈ ఏడాది 2026 జనవరి నుంచి ఇప్పటి వరకు స్టాక్ మార్కెట్లలో రూ.2.25 లక్షల కోట్ల విలువైన ఈక్విటీలను విదేశీ మదుపరులు విక్రయించారు. తమ పెట్టుబడులను తీసుకెళ్లారు. ఈ కారణాలతో అమెరికా డాలర్‌కు గిరాకీ బాగా పెరిగింది. రూపాయి విలువ పడిపోతోంది. దీంతో మన దగ్గర ఉన్న విదేశీ మారకపు నిల్వల విలువ భారీగా పడిపోతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫారెక్స్ నిల్వలు రూ.728.49 బిలియన్ డాలర్లుగా ఉండగా అది 4 నెలల్లోనే 47 బిలియన్ డాలర్లు తగ్గిపోయి 681.40 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. వీటిని కాపాడుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 6 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.57 వేల కోట్లు విలువైన పసిడి నిల్వలను విక్రయించినట్లు ప్రముఖ వార్తా సంస్థ బ్లూమ్ బర్గ్ తెలిపింది.ఫారెక్స్ నిల్వలు వృథాగా పోకుండా చూసేందుకు బంగారం దిగుమతిపై కస్టమ్స్ సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం రెట్టింపు కంటే పెంచి 15 శాతానికి చేసింది. ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉన్నా, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ఆర్థిక స్థితి దెబ్బతినకుండా చూసేందుకు పెట్రోల్, డీజిల్ ధరలనూ పెంచింది. అలాగే రిజర్వ్ బ్యాంక్ తన వద్ద ఉన్న నిల్వల్లో రూ.57 వేల కోట్ల పసిడిని మే 22తో ముగిసిన రెండు వారాల వ్యవధిలో విక్రయించింది. తద్వారా విదేశీ కరెన్సీ ఆస్తులకు ఈ మొత్తాన్ని జమ చేసుకుంది. మన ఫారెక్స్ నిల్వల్లో విదేశీ కరెన్సీ ఆస్తులు 543.032 బిలియన్ డాలర్లు కాగా పిసిడి నిల్వలు 114.786 బిలియన్ డాలర్ల మేర ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ లెక్కల ప్రకారమే 2 వారాల్లో పసిడి నిల్వల విలువ 6 బిలియన్ డాలర్లకు పైగా తగ్గింది.దేశ ఎగుమతుల కంటే దిగుమతులు బిల్లు భారీగా పెరుగుతోంది. దీంతో కరెంటు ఖాతా లోటు అంతకంతకూ అధికమవుతోంది. రూపాయి విలువ ఈ సంవత్సరంలో 7 శాతం వరకు పతనం అయ్యేందుకు కారణమైంది. అందుకే మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా ఉన్న సమయంలో డాలర్ నిల్వలను పెంచుకుని, రూపాయిని బలోపేతం చేయడంపై రిజర్వ్ బ్యాంక్ దృష్టి పెట్టింది. అందుకే బంగారం విక్రయిస్తోంది. ఈ ఏడాది మార్చి నెలలో ఆర్బీఐ వద్ద 880.52 టన్నుల బంగారం నిల్వలు ఉన్నాయి. వీటిలో 77 శాతం నిల్వలు భారత్‌లోనే ఉన్నాయి. అంతకు 6 నెలల క్రితం మన దేశంలో ఉన్న బంగారం నిల్వలు 66 శాతంగా ఉండడం గమనార్హం. మిగిలిన బంగారం బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్మెంట్స్ దగ్గర ఉండేది.

# హైదరాబాద్ కు పొంచి ఉన్న నీటి ప్రమాదం

## కేంద్ర జలశక్తి శాఖ షాకింగ్ రిపోర్ట్

హైదరాబాద్, జూన్ 3, హైదరాబాద్ మహా నగరం తీవ్ర భూగర్భ జల సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. కేంద్ర జలశక్తి శాఖ విడుదల చేసిన డైనమిక్ గ్రౌండ్‌వాటర్ రీసోర్స్ అసెస్‌మెంట్ రిపోర్ట్ 2025 ప్రకారం నగరంలోని మొత్తం 16 మండలాల్లో 15 మండలాలు డేంజర్ జోన్‌లో ఉన్నాయి. రాజస్థాన్‌లోని ఎడారి జిల్లాలైన బార్మర్, జైసల్మేర్, పంజాబ్‌లోని డార్క్ జోన్ జిల్లాలను తలపించేలా భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. తక్షణమే వర్షపు నీటిని భూమిలోకి ఇంకించే చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో తీవ్ర నీటి ఎద్దడి తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. హైదరాబాద్ మహా నగరం ఐటీ, రియల్ ఎస్టేట్ రంగాల్లో అంతర్జాతీయ స్థాయి పారిశ్రామిక హబ్‌గా దూసుకుపోతుంది. ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. మరో వైపు చూస్తే నగరం భయంకరమైన జల సంక్షోభం ఎదుర్కొనేందుకు సిద్ధమవుతోంది. కేంద్ర జలశక్తి శాఖ తాజాగా విడుదల చేసిన డైనమిక్ గ్రౌండ్ వాటర్ రీసోర్స్ అసెస్‌మెంట్ రిపోర్ట్ 2025 నివేదిక ప్రకారం.. హైదరాబాద్ జిల్లాలోని మొత్తం 16 మండలాల్లో ఏకంగా 15 మండలాలు భూగర్భ జలాల లభ్యత విషయంలో అత్యంత ప్రమాదకరమైన క్రిటికల్, ఓవర్-ఎక్స్‌ప్లాయిటెడ్ కేటగిరీల్లోకి పడిపోయాయి. ఈ గణంకాలు హైదరాబాద్‌ను రాజస్థాన్‌లోని ఎడారి జిల్లాలైన జైపూర్, జోధ్‌పూర్, బికనీర్, బార్మర్, జైసల్మేర్‌ల సరసన నిలబెట్టాయి.రాజస్థాన్‌లోనే అత్యంత ఎడారి ప్రాంతమైన బార్మర్ జిల్లాలో 14 మండలాలు ప్రమాదకర స్థితిలో ఉంటే.. హైదరాబాద్‌లో అంతకంటే ఎక్కువగా 15 మండలాలు ఆ స్థితికి చేరుకున్నాయి. నగరంలోని 50 శాతం మండలాలు అతిగా వాడబడిన కేటగిరీలో, మరో 43 శాతం మండలాలు క్లిష్టమైన స్థితిలో ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. పంజాబ్ రాష్ట్రంలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయిన జలంధర్, లూధియానా వంటి డార్క్ జోన్ జిల్లాలతో హైదరాబాద్ ప్రస్తుతం సమానంగా నిలిచింది. సికింద్రాబాద్, ఖైరతాబాద్, అమీర్‌పేట్, హిమాయత్‌నగర్, ముషీరాబాద్, నాంపల్లి, షేక్‌పేట్, సైదాబాద్ వంటి కీలక మండలాలు ఈ ప్రమాదకర జాబితాలో ఉన్నాయి. కేవలం హైదరాబాద్ మాత్రమే కాకుండా.. పొరుగున ఉన్న రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లోని మరో 10 మండలాలు, యాదాద్రి భువనగిరి జిల్లాలోని 5 మండలాలు సైతం ఇదే దుస్థితిని ఎదుర్కొంటున్నాయి. అడ్డూఅదుపూ లేకుండా బోరుబావుల ద్వారా భూగర్భ జలాలను తోడేయడం, నీటిని తిరిగి భూమిలోకి ఇంకించే కనీస సంస్కృతి లేకపోవడమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణమని జేఎన్‌టీయూహెచ్ వాటర్ రీసోర్సెస్ సెంటర్ రిటైర్డ్ ప్రొఫెసర్ బి. వెంకటేశ్వరరావు తెలిపారు. నగరంలో ప్రస్తుతం 1200 నుంచి 1500 అడుగుల లోతు వరకు బోర్లు వేసినా చుక్క నీరు పడటం లేదని భూమి కింద కేవలం గట్టి రాతి పొరలు మాత్రమే మిగిలాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఏడాదికి సగటున 900 మి.మీ నుండి 1000 మి.మీల భారీ వర్షపాతం నమోదవుతున్నప్పటికీ.. ఆ వర్షపు నీరంతా డ్రైనేజీల ద్వారా వృథాగా కొట్టుకుపోతోందే తప్ప భూమిలోకి ఇంకడం లేదని నిపుణులు విమర్శిస్తున్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిపుణుడు కె.ఎం. లక్ష్మణరావు మాట్లాడుతూ.. రాబోయే కాలంలో హైదరాబాద్ పూర్తిస్థాయి జల సంక్షోభంలో చిక్కుకోకుండా ఉండాలంటే కేవలం ప్రభుత్వంపైనే భారం వేయకుండా పౌరులు కూడా క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లలో బోరుబావులకు అనుసంధానంగా వర్షపు నీటి ఇంకుడు గుంతలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎకరం భూమి ధర రూ. 200 కోట్లు పలుకుతున్న నూతన ఐటీ కారిడార్ ప్రాంతాల్లో భూమి పైన ఉన్న సంపదతో పాటు భూమి కింద ఉన్న జల సంపదను కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమని అంటున్నారు. విచ్చలవిడి కాంక్రీట్ నిర్మాణాలను నియంత్రిస్తూ.. బోరుబావుల సంఖ్యపై పరిమితులు విధించి వర్షపు నీటిని సంరక్షించుకుంటేనే హైదరాబాద్ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. లేదంటే కష్టకాలం ఎదుర్కోకతప్పదని అంటున్నారు.

# మహానగరంలో ఉండేది ఎలా

## ఆకాశన్నంటున్న అద్దెలు

హైదరాబాద్, జూన్ 3,మహానగరంలో సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలకు సొంతిల్లు కొనడం ఒక కలగానే మిగిలిపోతుండగా, కనీసం అద్దె ఇంట్లోనైనా ఉందామన్నా కిరాయిలు ఆకాశాన్ని తాకుతున్నాయి. నగరంలో ప్రతి సంవత్సరం విపరీతంగా పెరుగుతున్న అద్దెల కారణంగా మధ్యతరగతి కుటుంబాలపై మోయలేని ఆర్థిక భారం పడుతోంది. సాధారణంగా వేసవి సెలవుల సమయంలో ఇళ్లు ఎక్కువగా ఖాళీ అవుతుంటాయి. ఆ తర్వాత జూన్ నెల వచ్చేసరికి ఉద్యోగుల బదిలీలు, పిల్లలను కొత్త స్కూళ్లు, కాలేజీలలో చేర్పించడం, అలాగే ఉపాధి కోసం ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి వచ్చేవారి వలసల కారణంగా అద్దె ఇళ్లకు విపరీతమైన డిమాండ్ పెరుగుతోంది. ఈ క్రమంలోనే మణికొండ వంటి ప్రాంతాల్లో ‘టులెట్’ బోర్డులు దర్శనమిస్తున్నాయి. నగరంలో భారీ అద్దెలను భరించలేక చాలామంది ప్రజలు శివార్లకు వెళ్లిపోతున్నారు. ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండే ఐటీ కారిడార్ పరిధిలో ఇళ్ల అద్దెలు మరీ ఎక్కువగా ఉన్నాయి. మణికొండ పంచవటి కాలనీలో ఒక 3 ःఊఐ ఫ్లాట్ అద్దె నెలకు రూ. 40,000 నుండి రూ. 50,000 మధ్య పలుకుతుండగా, 2 ःఊఐ ఫ్లాట్‌కు రూ. 25,000 నుండి రూ. 30,000 వరకు డిమాండ్ చేస్తున్నారు. వీకర్ సెక్షన్ ఏరియాల్లో సైతం అద్దెలు రూ. 18,000 నుండి రూ. 20,000 కు చేరాయి. బాచుపల్లిలోని కొత్త ఫ్లాట్లలో 2 ःఊఐ కిరాయి రూ. 20,000 వరకు ఉండగా, కిస్మత్‌పూర్‌లో రూ.25,000 గా ఉంది. కేపీహెచ్‌బీ పాత ఫ్లాట్లలో సైతం రూ. 20,000 నుండి రూ. 25,000 వరకు అద్దెలు వసూలు చేస్తున్నారు. మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, తెల్లాపూర్, నల్లగండ్ల, గండిపేట వంటి ఐటీ ప్రాంతాలలోని గేటెడ్ కమ్యూనిటీలలో అద్దెలు మరింత దారుణంగా ఉన్నాయి. అక్కడ 2 ःఊఐ కి రూ. 40,000 ? రూ. 50,000, అలాగే 3 ःఊఐ కి రూ. 60,000 నుండి రూ. 80,000 వరకు రెంట్ వసూలు చేస్తున్నారు. విల్లాల అద్దెలైతే ఏకంగా రూ. 1 లక్ష నుండి రూ. 2 లక్షల వరకు పలుకుతున్నాయి. వీటికి అదనంగా మెయింటెనెన్స్ చార్జీల కింద రూ. 2,000 నుండి రూ. 6,000 వరకు, అలాగే కరెంట్, వాటర్ బిల్లులు అదనం.

సర్దుకుపోతున్న జనం..

నగరంలో అద్దె ఇళ్లపై ఆధారపడిన వారి పరిస్థితిని జనగణన ప్రాథమిక డేటా స్పష్టం చేస్తోంది. నగరంలోని 65 శాతం కుటుంబాలకు అద్దె ఇళ్లే ఆధారం. వీరిలో 50 శాతం కుటుంబాలకు ఈ ఇళ్ల అద్దెలు తీవ్ర ఆర్థిక భారంగా మారాయి. ముఖ్యంగా అపార్ట్‌మెంట్లలో అద్దెలు చాలా ఎక్కువగా ఉంటున్నాయి. భూముల ధరలు విపరీతంగా పెరగడం వల్లే ఇళ్ల నిర్మాణ వ్యయం పెరిగి, ఆ ప్రభావం అద్దెలపై పడుతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం కనీసం రూ. కోటి పెడితే గానీ నగరంలో సౌకర్యవంతమైన ఇల్లు కొనే పరిస్థితి లేదు. తాము కట్టే అద్దెలు కనీసం హోమ్ లోన్ ఈఎంఐకి సరిపోవాలని కొందరు యజమానులు ఆశిస్తున్నారు. అద్దెలు భరించలేక జనం శివార్లకు వెళ్తున్న నేపథ్యంలో, ప్రభుత్వం ప్రజా రవాణా సౌకర్యాలను పెంచాలని, మెట్రోను విస్తరించాలని తెలంగాణ డెవలపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జె.వి. రావు అభి ప్రా య ం వ ద్దా ర ం . వం రో వ్వై వ్య భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తూ, లక్షల్లో జీతాలు వచ్చే వారికి అద్దె పెద్ద సమస్య కాకపోయినా, రూ. 50,000 లోపు వేతనం వచ్చే వారు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల ఫీజులు, కుటుంబ ఆరోగ్యం కోసమే సగం జీతం ఖర్చవుతుండటంతో, సింగిల్ బెడ్‌రూమ్ ఇల్లు లేదా శివార్లలో రూ. 10,000 లోపు దొరికే ఇళ్ల వైపు మొగ్గు చూపుతున్నారు. ఐటీ కారిడార్‌లో పనిచేసే ఒక ఉద్యోగి తన బడ్జెట్ పరిమితుల వల్ల ఈసీఐఎల్ నుండి రాకపోకలు సాగిస్తుండగా, కేవలం ట్రాఫిక్ కారణంగానే రోజూ 4 గంటల సమయం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు

# 9 జిల్లాల్లో మహిళా శక్తి బజార్లు

ఖమ్మం, జూన్ 3, తెలంగాణలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక బలోపేతమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ప్రణాళికలను అమలు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు.. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా మహిళా సూపర్ బజార్లు, లాజిస్టిక్స్ హబ్‌లు, ఆధునిక రైస్‌మిల్లులను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ వేగంగా అడుగులు వేస్తోంది. మహిళా సంఘాల ద్వారానే వీటిని సమర్థవంతంగా నిర్వహించి, వారిని వ్యాపారవేత్తలుగా మార్చాలనేది ప్రభుత్వ ప్రధాన సంకల్పంఈ బృహత్తర ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో వేగవంతం చేసేందుకు సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్ సోమవారం రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల ఉన్నతాధికారులతో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తొలి దశ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఒకేసారి కాకుండా.. ప్రాథమికంగా తొమ్మిది ఉమ్మడి జిల్లా కేంద్రాలైన హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్, సంగారెడ్డిలలో ఒక్కొక్కటి చొప్పున మహిళా శక్తి సూపర్ బజార్లను స్థాపించాలని ప్రతిపాదించారు. ప్రముఖ రిటైల్ సంస్థ డీమార్ట్ తరహాలోనే ఈ సూపర్ బజార్లలో ప్రజలకు అవసరమైన అన్ని రకాల నిత్యావసర సరకులు, గృహోపకరణాలు, వివిధ రకాల పరికరాలను తక్కువ ధరలకే విక్రయించేలా ఖమ్మంలో మొదటి పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్నారుఈ సూపర్ బజార్ల నిర్మాణానికి జనాభా సాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సుమారు 5 వేల గజాల స్థలం అవసరమని సెర్ప్ అధికారులు గుర్తించారు. అనువైన ప్రభుత్వ భూముల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ ఆయా జిల్లాల కలెక్టర్లకు తక్షణమే లేఖలు రాయాలని నిర్ణయించారు. మరోవైపు.. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం జిల్లాలో లాజిస్టిక్స్ హబ్, రైస్‌మిల్లు ఏర్పాటుకు అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని, ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఖమ్మం జిల్లాలో భారీ గోదాం, లాజిస్టిక్స్ హబ్, రైస్ మిల్లుల స్థాపన కోసం దాదాపు 20 ఎకరాల భూమిని కేటాయించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక ప్రతిపాదనలు పంపేందుకు సెర్ప్ సిద్ధమైంది. ఈ మెగా ప్రాజెక్టుల విజయవంతమైన నిర్వహణకు గానూ.. ఆయా జిల్లాల్లో సమర్థవంతంగా పనిచేస్తున్న మహిళా సమాఖ్యలను ఎంపిక చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు సెర్ప్ ఆదేశాలు జారీ చేసింది. ఖమ్మంలో నిర్మించబోయే లాజిస్టిక్స్ హబ్, రైస్ మిల్లులకు సంబంధించి ఏ మండలంలో అయితే భూమిని ఎంపిక చేస్తారో అదే మండలానికి చెందిన మహిళా సమాఖ్యకే పూర్తి నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని అధికారులు భావిస్తున్నారు.

భవిష్యత్తులో మిగిలిన జిల్లాల్లోనూ ఇదే తరహా ప్రాజెక్టులు రానున్నందున.. రాష్ట్రంలోని అన్ని మహిళా సమాఖ్యలు ఆర్థిక నిర్వహణకు, వ్యాపార బాధ్యతలకు సిద్ధంగా ఉండాలని సెర్ప్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో తెలంగాణ మహిళా లోకంలో సరికొత్త ఉపాధి విప్లవం రానుంది

# ట్రాఫిక్ చలాన్లపై బిగ్ అప్‌డేట్..

## నెల రోజులే గడువు, త్వరపడండి

హైదరాబాద్, జూన్ 3, ట్రాఫిక్ చలాన్ల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వాహనదారులు ఆన్‌లైన్‌లో తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని తేల్చి చెప్పింది. ఇందుకోసం నెల రోజుల గడువు ఇచ్చింది. నెల రోజుల తర్వాత వివరాలు నమోదు చేసుకోకపోయినా.. ట్రాఫిక్ చలాన్ పంపించినట్లుగానే భావిస్తామని స్పష్టం చేసింది. ట్రాఫిక్ చలాన్ల విషయంలో మరింత కఠిన వైఖరి అనుసరించడంలో భాగంగా సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. రోడ్లపై ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వాహనదారులపై పోలీసులు చలాన్‌లు విధించి.. వారిపై కొరఢా ఝళిపిస్తూ ఉంటారు. అయితే కొంతమంది వాహనదారులపై అనేక ట్రాఫిక్ చలాన్లు పెండింగ్‌లో ఉన్నా.. పోలీసులకు దొరకకుండా తప్పించుకుని తిరుగుతూ ఉంటారు. ఈ క్రమంలోనే కొందరు వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు దొరికినప్పుడు వారి బండి నంబర్ ఆధారంగా చెక్ చేస్తే.. వేలల్లో ట్రాఫిక్ చలాన్లు పెండింగ్‌లో ఉండటం మనం చూస్తూనే ఉన్నాం. చాలా మంది పోలీసులకు చిక్కకుండా.. ట్రాఫిక్ చలాన్లను కట్టకుండా.. ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమిస్తూ.. ఫైన్లు కొండలా పేరుకుపోయే వరకు ప్రయాణిస్తూ ఉంటారు. అయితే ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగానే తెలంగాణలోని వాహనదారులకు రాష్ట్ర ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. ఇక నుంచి ట్రాఫిక్ చలాన్ల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పక్కాగా ఓనర్లకు చేరేలా తెలంగాణ రవాణా శాఖ సరికొత్త నిబంధనను అమలులోకి తీసుకొచ్చింది. ట్రాఫిక్ చలాన్లకు సంబంధించిన అలర్ట్స్‌ను ఎప్పటికప్పుడు పొందేందుకు ప్రతీ ఒక్కరూ తమ వివరాలను వెంటనే వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేసుకోవాలని స్పష్టం చేసింది.

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కొత్త నిబంధనల ప్రకారం.. ప్రతీ ఒక్క వాహనదారుడు తమ మొబైల్ నంబర్, వాట్సాప్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ వంటి వివరాలను నెల రోజుల్లోగా కేంద్ర ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ అయిన వాహన్ (లజీష్ట్రజీని. జూజీతీతిలజీష్ట్రజీని. ఐనీల. తిని లో తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని రవాణా శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇక ప్రభుత్వం ఇచ్చిన నెల రోజుల గడువు ముగిసిన తర్వాత.. వాహన్ పోర్టల్‌లో నమోదై ఉన్న సెల్ నంబరు, ఈ-మెయిల్‌కు ఎస్ఎంఎస్, వాట్సాప్, మెయిల్ ద్వారా ట్రాఫిక్ చలాన్లను సంబంధిత వాహన యజమానికి పంపిస్తారు. ఇలా పంపిన ట్రాఫిక్ చలాన్లు.. వారికి అందినట్లుగానే రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది. ఇంతకుముందు లాగా.. తమ ఫోన్‌కు ట్రాఫిక్ చలాన్ రాలేదని.. దానికి సంబంధించి మెసేజ్ కూడా రాలేదని.. అసలు తమ బండిపై ట్రాఫిక్ చలాన్ ఉందనే సమాచారం కూడా తమకు తెలియదని వాహనదారులు చలాన్లు తప్పించుకోవడానికి వీలు ఉండదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. గతంలో ఇలాంటి సాకులు చెప్పి.. కొందరు వాహనదారులు ట్రాఫిక్ చలాన్లు కట్టకుండా తప్పించుకునే వారని తెలిపాయి. పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలాన్ల వసూళ్లను మరింత వేగంగా వసూలు చేయడానికి.. ట్రాఫిక్ చలాన్ల విషయంలో మరింత పారదర్శకతను పెంచడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# తుమ్మిడిహట్టి అనేది రేవంత్ రెడ్డి డైవర్షన్ గేమ్




హైదరాబాద్ తుమ్మిడిహట్టి అనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైవర్షన్ గేమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్పుడు అతను కూర్చుంటున్న ఆఫీసులోనే గతంలో మహారాష్ట్ర ప్రభుత్వాలు తుమ్మిడిహట్టి ప్రాజెక్టు 152 మీటర్ల ఎత్తుకు పెంచడానికి ఒప్పుకోము అని రాసిన లేఖలు ఉన్నాయని అన్నారు.

బుధవారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన మీట్ ద ప్రెస్ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడే తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు ఒప్పించలేకపోయారు. అంత పట్టుదల ఉంటే పోయి మహారాష్ట్ర సీఎం ఇంటి ముందు నిరహార దీక్ష చేయండని కేటీఆర్ సలహా ఇచ్చారు.

ఏప ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యాలపై కేటీఆర్ స్యపందించారు. దేశభక్తి గురించి పవన్ కళ్యాణ్ పాఠాలు చెప్పాల్సిన పనిలేదు. నిజాం సర్కారుకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు కదం తొక్కిన నేల తెలంగాణ అని అన్నారు. సోదరుడిగా వస్తే ఇంటికి పిలిచి హైదరాబాద్ బిర్యానీ పెడతా. కానీ, సెక్రటేరియట్ లో కూర్చుని పెత్తనం చేస్తామంటే ఒప్పుకోమని అన్నారు.

# పోలీసు కస్టడిలో సుబోధ్ సింగ్

కరీంనగర్ ... మోస్ట్ వాంటెడ్ దొంగ సుబోధ్ సింగ్ ను పోలీసులు కస్టడిలోకి తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన పీఎంజే జెవెల్లర్స్ దోపిడీ కేసులో సుబోధ్ సింగ్ ప్రధాన సూత్రధారి. నిందితుడిని పోలీసులు బీహార్ పాట్నా జైలు నుండి పిటి వారెంట్ పై కరీంనగర్ తీసుకువచ్చారు. సుబోధ్ సింగ్ తో పాటుగా మరో ముగ్గురు దొంగలను కస్టడీ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ జైలు వద్ద భారీ పోలీస్ భద్రత కల్పించారు.

# హరీశ్ రావు జన్మదినోత్సవం

## సందర్భంగా పాటల సీడీ ఆవిష్కరణ

సంగారెడ్డి బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని యువ నాయకుడు వికాస్ రూపొందించిన ప్రత్యేక పాటల సీడీని మాజీ మంత్రి హరీశ్ రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ, హరీశ్ రావు నాయకత్వం తెలంగాణ రాష్ట్రానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో హరీశ్ రావు కీలక పాత్ర పోషించారని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చొరవ, నిబద్ధత రాష్ట్ర ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమం నుంచి రాష్ట్ర నిర్మాణం వరకు హరీశ్ రావు చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసే నాయకుడిగా హరీశ్ రావు ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు.

# భారీ ఫ్లైఓవర్ కోసం సర్కార్ గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, జూన్ 3, హైదరాబాద్‌లో మరో భారీ ఫ్లైఓవర్ నిర్మించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎల్‌బీ నగర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మార్గంలో.. ఇప్పటికే చాలా ఫ్లైఓవర్లు నిర్మించగా.. తాజాగా మరొకటి నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. ఈ 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.416 కోట్లను కూడా కేటాయించింది. త్వరలోనే ఈ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం భూసేకరణ పనులు చేపట్టేందుకు అధికారులు రెడీ అయ్యారు.విశ్వనగరంగా మారుతున్న హైదరాబాద్‌లో ట్రాఫిక్ తగ్గించేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే జంక్షన్లను గుర్తించి.. అక్కడ భారీ ఫ్లైఓవర్లను నిర్మిస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా నగరంలో మరో ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ఎల్‌బీ నగర్ జోన్‌లో రూ.416 కోట్లతో 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. హైదరాబాద్ నగరంలోని తూర్పు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. టీకేఆర్ కాలేజీ, గాయత్రీనగర్, మందమల్లమ్మ జంక్షన్ల మీదుగా నిర్మించనున్న ఈ ఫ్లైఓవర్ వల్ల ఎయిర్‌పోర్టు మార్గంలో ట్రాఫిక్ తగ్గనుంది.అంతేకాకుండా మీర్‌పేట్, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ ప్రాంతాలకు మెరుగైన అనుసంధానం లభించనుండగా.. ఎల్‌బీ నగర్ నుంచి పాతబస్తీ వైపు ప్రయాణం కూడా మరింత సులభతరం కానుంది. త్వరలోనే భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్ పనులు ప్రారంభం కానున్నాయని సంబంధిత అధికారులు వెల్లడించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలోని ఎల్‌బీ నగర్ జోన్‌లో రూ.416 కోట్ల వ్యయంతో ఈ 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి తాజాగా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది.టీకేఆర్ కాలేజీ జంక్షన్, గాయత్రీనగర్ జంక్షన్, మందమల్లమ్మ జంక్షన్‌ల మీదుగా ఈ ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నారు. హైదరాబాద్ సిటీ ఇన్నోవేషన్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు కింద ఈ పనులను ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్) టర్న్‌కీ విధానంలో కేఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ చేపట్టనుంది. ఎల్బీ నగర్ నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లే మార్గంలో ప్రస్తుతం ఈ 3 జంక్షన్ల వద్ద తీవ్రంగా ట్రాఫిక్ రద్దీ నెలకొంటోంది. మరీ ముఖ్యంగా గత 10 ఏళ్లలో మీర్‌పేట్, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ వంటి ప్రాంతాల్లో జనాభా గణనీయంగా పెరగడంతో పాటు.. వాహనాల రాకపోకలు కూడా భారీగా పెరిగాయి. దీంతో ఈ ప్రాంతాల నుంచి నగరానికి వెళ్లే ప్రయాణికులతో నిత్యం ఆ మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.ఈ 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి అయితే నగర తూర్పు భాగాన్ని విస్తరించిన దక్షిణ ప్రాంతాలతో అనుసంధానం చేయడంలో కీలక పాత్ర పోషించనుందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. మీర్‌పేట్, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ ప్రాంతాల ప్రజలకు వేగవంతమైన రాకపోకలు అందుబాటులోకి రానున్నాయని చెబుతున్నాయి. అలాగే ఎల్‌బీ నగర్ జంక్షన్ నుంచి సంతోష్‌నగర్ మీదుగా పాతబస్తీ వైపు వెళ్లే ప్రయాణికులకు కూడా ప్రయాణ సమయం భారీగా తగ్గే అవకాశం ఉందని వెల్లడిస్తున్నాయి.మున్సిపల్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ఫ్లైఓవర్‌కు సంబంధించి.. త్వరలోనే భూసేకరణ, విద్యుత్ లైన్లు, నీటి పైపులు వంటి యుటిలిటీ షిఫ్టింగ్ పనులను ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ పూర్తి అయితే నగర తూర్పు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యకు గణనీయమైన ఉపశమనం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

# పోలీసులకు చిక్కిన క్రికెట్ బుకీ గోల్డ్ శేఖర్

పల్నాడు జిల్లా నకిలీ ట్రేడింగ్ కంపెనీ పేరిట మోసాలకు పాల్పడుతున్న ప్రముఖ క్రికెట్ బుకీ కందుకూరి వీరశేఖరాచారి అలియాస్ 'గోల్డ్ శేఖర్' ను పల్నాడు జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహానందిలోని ఒక లాడ్జిలో తలదాచుకున్న అతడిని, అతని భార్యను పోలీసులు అరెస్టు చేశారుసాధారణ గోల్డ్ అప్రైజర్‌గా ప్రారంభమైన గోల్డ్ శేఖర్, తర్వాత క్రికెట్ బుకీ అవతారం ఎత్తి కోట్ల రూపాయల లావాదేవీలు నిర్వహించినట్లు పోలీసులు వెల్లడించారు. క్రికెట్ బెట్టింగ్‌లు, ట్రేడింగ్ పేరుతో మోసాలు చేస్తూ భారీ స్థాయిలో డబ్బులు సంపాదించినట్లు విచారణలో బయటపడింది.గోల్డ్ శేఖర్‌పై ఇప్పటికే పలు క్రికెట్ బెట్టింగ్ కేసులు, పోక్సో, ఎన్‌డీపీఎస్ కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు తెలిపారు. తాజాగా రూ.1.44 కోట్ల మోసం కేసులో కీలక నిందితుడిగా అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు వెల్లడించారు. ఇంకా ఈ కేసులో మరికొందరు నిందితులు పరారీలో ఉన్నారని, త్వరలో వారిని కూడా అరెస్ట్ చేస్తామని టూ టౌన్ పోలీసులు స్పష్టం చేశారు.

# పులి దాడిలో లేగదూడలు మృతి.

దేవిపట్నం : దేవీపట్నం మండలం గంగంపాలెం గ్రామంలో బుధవారం తెల్లవారుజామున పులి పంజా విసిరింది.పులిదాడిలో 13 దూడలు మృతి చెందాయి. ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ ప్రధాన కార్యాలయం నుండి ముఖ్య వన్యప్రాణి సంరక్షకులు ఎన్. నాగేశ్వరరావు,రాజమండ్రి ముఖ్య అటవీ సంరక్షకురాలు డాక్టర్ జ్యోతి, రంపచోడవరం డిఎఫ్ఓ ఎన్.రామచంద్ర రావు,రాజమండ్రి ఫ్లయింగ్ స్క్వాడ్ డిఎఫ్ఓ టి. శ్రీనివాస రావు,రంపచోడవరం సబ్ డిఎఫ్ఓ టి. అనూష,అడ్డతీగల సబ్ డిఎఫ్ఓ జె.వి. సుబ్బారెడ్డి, ఇందుకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కొండల రావు, ఫోక్స్‌పేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస రావు, 6 ర్యాపిడ్ రెస్క్యూ టీమ్ (ఖీఖీ) బృందాలు, 5 ప్రజా అవగాహన బృందాలు, 4 ట్రాంక్విలైజింగ్ బృందాలు, 2 డ్రోన్ బృందాలు, 1 కేజ్ బృందం, 1 వన్యప్రాణి అంబులెన్స్ బృందం మరియు ఫ్రంట్‌లైన్ సిబ్బందితో కూడిన 19 హనుమాన్ బృందాలు, మొత్తం సుమారు 100 మంది సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నిన్న రాత్రి హనుమాన్ బృందాలు సమీపంలోని గ్రామస్తులకు పులి సంచారం గురించి తెలియజేశాయి.పశువులను కోల్పోయిన రైతులకు అటవీ శాఖ వెంటనే నష్టపరిహారం చెల్లిస్తుందని సీనియర్ అటవీ అధికారులు హామీ ఇచ్చారు.ప్రజల రాకపోకలను నియంత్రించడానికి, అటవీ శాఖ పోతవరం–దండంగి రహదారిని దిగ్బంధించి ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది.

# టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవితతో బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ భేటీ

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవితతో బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ భేటీ అయ్యారుబంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో హైదరాబాద్ బ్రిటిష్ హైకమిషన్ పొలిటికల్ అండ్ ఎకనామిక్ అడ్వైజర్ నళిని రాఘురామన్ తో కలిసి డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ మర్యాద పూర్వకంగా కవితను కలిశారు. భారత్ ? యునైటెడ్ కింగ్ డమ్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, ఇతర అంశాలపై చర్చించారుసమావేశంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు

# నార్వే పార్లమెంట్ సమావేశాలను ప్రత్యక్షంగా తిలకించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి బృందం.

బుధవారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి, విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం. భరత్ లతో పాటు సహచర పార్లమెంట్ సభ్యులతో కలిసి నార్వే పార్లమెంట్ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించడం గౌరవంగా భావిస్తున్నామని అన్నారు. పాలన, ప్రజా విధానాలు, అంతర్జాతీయ సహకారం వంటి అంశాలపై జరిగిన ఫలవంతమైన ఆలోచనల మార్పిడి విలువైన అవగాహనను అందించడమే కాకుండా, పరస్పర అవగాహనను మరింత బలోపేతం చేసిందని, ఒకరినొకరు అనుభవాల గురించి నేర్చుకుంటూ, భవిష్యత్తులో మరింత బలమైన ద్వైపాక్షిక సంబంధాలను పెంపొందించేందుకు ఎదురుచూస్తున్నామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

## తెరనిమ్ బయోలాజిక్స్ కు భూమి పూజ
## పాల్గోన్న మంత్రులు దామోదర, దుద్దిళ్ల

సంగారెడ్డి రూ.1200 కోట్ల భారీ పెట్టుబడితో సంగారెడ్డి జిల్లా హత్నూరా మండలం బోర్పట్ల గ్రామంలో ఏర్పాటు చేయనున్న " తెరనిమ్ బయోలాజిక్స్" మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీకి మంత్రి దామోదర్ రాజనర్సింహా తో కలిసి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బుధవారం భూమి పూజ నిర్వహించారు.

ఈ అత్యాధునిక ఫెసిలిటీలో క్యాన్సర్, ఇతర ప్రాణాంతక వ్యాధుల చికిత్సకు సంబంధించిన ఔషధాలను ఉత్పత్తి చేసి... యూఎస్ సహా పలు అంతర్జాతీయ దేశాలకు ఎగుమతి చేయనున్నారు. ఈ నూతన ఫెసిలిటీ ద్వారా సుమారు 1500 మందికి కొత్తగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. " తెరనిమ్ బయోలాజిక్స్ " రాకతో లైఫ్ సైన్సెస్ రంగంలో "మేడ్ ఇన్ తెలంగాణ" బ్రాండ్ విలువ అంతర్జాతీయ స్థాయిలో మరింత పటిష్ఠం కానుంది.

# కాకరపాడు హెచ్‌పీ బంకు అంశంపై హెచ్‌పీసీఎల్ అధికారి యామిని ప్రియా స్పష్టత

కొయ్యూరు, కాకరపాడు హెచ్‌పీ పెట్రోల్ బంకుకు సంబంధించి వినియోగదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో హెచ్‌పీసీఎల్ అధికారి యామిని ప్రియా స్పందించారు. పెట్రోల్ బంకుల్లో వినియోగదారుల నుంచి అదనంగా డబ్బులు తీసుకోవడం నిబంధనలకు విరుద్ధమని, అలా జరిగితే సంబంధిత బంకుపై చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే బంక్‌లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ లేదా నోటీస్ బోర్డులో ఉన్న అధికారిక సంప్రదింపు నంబర్లకు ఫిర్యాదు చేయాలని ఆమె సూచించారు. వినియోగదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు హెచ్‌పీసీఎల్ పర్యవేక్షణ వ్యవస్థ అందుబాటులో ఉందని తెలిపారు. రైతులు డీజిల్‌ను డబ్బాల్లో తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉంటే బంక్ మేనేజర్‌తో ముందుగా మాట్లాడి అవసరమైన అనుమతులు తీసుకుని, నిర్దిష్ట పరిమితి మేరకు మాత్రమే ఇంధనం తీసుకెళ్లే అవకాశం ఉంటుందని ఆమె వివరించారు. ఈ ప్రక్రియలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.ఇలాంటి పరిస్థితులు మళ్లీ కొనసాగితే సంబంధిత బంక్‌పై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, అవసరమైతే సేల్స్‌ను నిలిపివేసే అవకాశం కూడా ఉంటుందని హెచ్‌పీసీఎల్ అధికారి యామిని ప్రియా తెలిపారు. ప్రజల నుంచి ఇలాంటి ఫిర్యాదులు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేశారు.ఈ అంశంపై ఐటీడీఏ అధికారుల దృష్టికి కూడా విషయం తీసుకెళ్లినట్లు ఆమె తెలిపారు. ఇకపై ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షణ మరింత కఠినతరం చేస్తామని హెచ్‌పీసీఎల్ అధికారి యామిని ప్రియా తెలిపారు.

## ప్రమోద్ కుమార్ కుటుంబానికి రూ కోటి బీమా చెక్కు




హైదరాబాద్ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఎస్పీడీసీఎల్ లైన్మెన్ ప్రమోద్ కుమార్ కుటుంబానికి రూ.1 కోటి ప్రమాద బీమా చెక్కును ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం అందజేసారు. ప్రమోద్ కుమార్ సతీమణి స్వప్నకు ఈ బీమా క్లెయిమ్ మొత్తాన్ని వేగంగా అందించి, బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించారు.

ప్రజల సేవలో నిరంతరం శ్రమించే ఉద్యోగుల సంక్షేమం, వారి కుటుంబాల భద్రత పట్ల మన రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భట్టి అన్నారు.

## భూ తగాదాల్లో సెటిల్‌మెంట్లు చేసేవారికి "కౌన్సిలింగ్" ఇవ్వండి -వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్.




భూతగాదాల కేసుల్లో మధ్యవర్తిత్వం వహిస్తూ సెటిల్‌మెంట్లకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే రౌడీ షీటర్లకు "కౌన్సిలింగ్" నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులను ఆదేశించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం కెయూసి పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ ఉదయం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, ఏసిపి నర్సింహరావు, ఇన్స్‌స్పెక్టర్ రవికుమార్ పుష్పగుచ్చాలను అందజేసి స్వాగతం పలికాలికారు. పోలీస్ కమిషనర్ ముందుగా స్టేషన్ పరిసరాలు, స్టోర్, కేసు ప్రాపర్టీగదులు, స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, బాలమిత్ర పోలీస్ స్టేషన్ క్రీడా ప్రాంగణాన్ని పోలీస్ కమిషనర్ పరిశీలించారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ సంబంధించిన రికార్డులను, రౌడీ షీటర్లు, అనుమానితుల రికార్డులను పరిశీలిస్తూ, పోలీస్ స్టేషన్ పరిధిలో యాక్టివ్‌గా వున్న రౌడీ షీటర్లు, అనుమానితులు ఎవరు, ప్రస్తుతం వాళ్ళు ఎలావున్నారు..ఏం చేస్తున్నారు మొదలైన వివరాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ ఇన్స్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తగాదాల్లో తలదూర్చే రౌడీ షీటర్లతో పాటు బెదిరింపులకు పాల్పడే వారికి ప్రత్యేక "కౌన్సిలింగ్" ఇవ్వాలని, రౌడీ షీటర్లపట్ల సానుభూతి ధోరణి ప్రదర్శించవద్దని, యాక్టివ్‌గా వున్న రౌడీపై నజర్ పెట్టాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ముఖ్యంగా స్థానికంగా వున్న సామాజిక రుగ్మతలపై అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని, విద్యా సంస్థల్లో సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, ట్రాఫిక్ నిబంధనలపై ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, స్టేషన్ ఎస్.ఐలు అప్పగించిన సెక్టార్ పరిధిలో నేరాల నియంత్రించడంతో పాటు, ముందస్తు సమాచారాన్ని సేకరించాలని పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ కార్యక్రమములో ఎస్.ఐలు నవీన్ కుమార్, కళ్యాణ్‌కుమర్, రాజమౌళి పాల్గోన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గోర్ల కాపరితో సహ పలు గెర్రెలు మృతి

నల్గొండ జిల్లా డిండి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గోర్ల కాపరితో పాటు వందలాది గొర్రెలు మృత్యువాత పడ్డాయి.. విప్ బీర్ల అయిలయ్యా, ఎమ్మెల్యే బాలు నాయక్, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, గోర్ల మేకల కార్పొరేషన్ల చైర్మన్ సరితా యాదవ్ తదితరులు సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితులు పరిశీలించారు.

## ఆన్లైన్ బెట్టింగ్స్పై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

న్యూఢిల్లీ ఆన్లైన్ బెట్టింగ్స్పై సుప్రీంకోర్టు సంచలన తీర్పు నిచ్చింది. ఆన్లైన్ బెట్టింగ్స్ నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక చేసిన చట్టాలు పూర్తిగా చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేసింది. ఆన్లైన్ జూదాలను నిషేధించే పూర్తి అధికారం రాష్ట్ర ప్రభుత్వాలదే. నైపుణ్యంతో కూడిన ఆటలైనా సరే.. డబ్బులు పెట్టి బెట్టింగ్ వేస్తే రాజ్యాంగ రక్షణ ఉండదని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది.

## అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు ..ఒకరికి గాయాలు


సికింద్రాబాద్.. జూబ్లీ బస్ స్టేషన్ వద్ద ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. ప్రయాణికుల పైకి దూసుకెళ్లింది. ఘటనలో ద్విచక్ర వాహనదారుడు శివ బస్సు చక్రాల కింద ఇరుక్కుపోయాడు. బస్సు కింద నలిగిపోయిన శివను కాపాడిన వాహనదారులు, అతడిని ఆస్పత్రికి తరలించారు.

## భారీ ఎత్తున గంజాయి స్వాధీనం

సికింద్రాబాద్ అంతరాష్ట్ర గంజాయి ముఠాను జూబ్లీహిల్స్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసారు. సస్పెన్షన్ లో ఉన్న శివకృష్ణ అనే సి.ఐ.ఎస్ .ఎఫ్ కానిస్టేబుల్ ను అరెస్ట్ చేసారు. శివకృష్ణ అనే వ్యక్తి కేరళలో పోలీస్ సి ఐ ఎస్ ఎఫ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహించేబాదు. .అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. టాస్క్ ఫోర్స్ డిసిపి వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ మాట్లాడుతూ నిందితుడినుంచి 79 లక్షల విలువైన 158 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని అన్నారు. 2009 లో విధుల్లోకి చేరిన శివకృష్ణ ఆర్థిక పరిస్థితులు బాగలేకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలని ఈ అక్రమ మార్గాన్ని ఎంచుకున్నాడు. గతంలో ఇతనిపై రెండు కేసులు ఉన్నాయి..కేరళలో ఇతను విధులు నిర్వహించే క్రమంలో రెండుసార్లు పోలీసులకు పట్టుబడ్డాడు.

# మనిషికి ఆరోగ్యానికి మించి ఆస్తి ఉండదు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



గుంటూరుదశాబ్దాలుగా వైద్యం రంగంలో లలితా గ్రూప్ ఉంది. గుంటూరులో ఇలాంటి అత్యాధునిక ఆసుపత్రిని ప్రారంభించుకోవడం సంతోషకరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం ఆయన గుంటూరులో లలితా హాస్పిటల్ ను ప్రారంభించారు.

చంద్రబాబు మాట్లాడుతూ సౌత్ ఇండియాలోనే మొదటి సారి ఆధునిక ఎమ్ఆర్ఐ స్కాన్ ఇక్కడికి తీసుకొచ్చారు. 1995లో నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులు, ఇతర చిన్న ఆసుపత్రులు హైదరాబాద్లో ఉండేవి. నాడు హైదరాబాద్ లో హెల్త్ టూరిజాన్ని ప్రమోట్ చేశాం. దేశంలో ఎక్కడి నుంచైనా ఇప్పుడు హైదరాబాద్ వచ్చి ట్రీట్మెంట్ చేయించుకుంటున్నారు. రాబోయే రోజుల్లో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లోని రోగులు అమరావతి వచ్చి ట్రీట్మెంట్ చేయించుకుంటారు. 15 లక్షల పేషెంట్లకు ఈ ఆసుపత్రి ట్రీట్మెంట్ ఇచ్చింది. బ్రాండ్ ఎస్టిబ్లిష్ చేస్తే దానికి తిరుగుండదనడానికి లలితా ఆసుపత్రి ఒక నిదర్శనమని అన్నారు. విలువలు లేకపోతే లాజికల్ గా తీసుకెళ్లలేం. ప్రజల్లో నమ్మకం, విశ్వసనీయత కలగాలి.. అప్పుడే ఏ వ్యవస్థకైనా మనుగడ. ఏడు ఎకరాల్లో 600 పడకలతో ఈ లలితా ఆసుపత్రి ఏర్పాటైంది. 32 విభాగాలు సేవలందించే ఏకైక సెంటర్. కార్డియాలజీ, న్యూరాలజీ, జాయింట్ రీప్లేస్మెంట్ వంటి సేవలను ఇక్కడ అందిస్తారు. ల్యాండ్ మార్క్ ఇనిస్టిట్యూట్ గా లలితా ఆసుపత్రి మారుతుంది. మనిషికి ఆరోగ్యానికి మించి ఆస్తి ఉండదు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటేనే నిజమైన ధనవంతుడు. వేల కోట్లు ఉన్నా, ప్యాలెస్ లు ఉన్నా, ఆరోగ్యం లేకపోతే ఉపయోగం లేదు. హెల్తీ సిటిజన్సే వెల్తీ నేషన్ నిర్మిస్తారు. మేం సంజీవని ప్రాజెక్టు తీసుకొచ్చాం. ఇది కంప్లీట్ హెల్త్ కేర్ ప్రోగ్రాం. మంత్రి కూడా ప్రజలకు మెరుగైన వైద్యం కోసం పని చేస్తున్నారు. డిజిటల్ హెల్త్ రికార్డులు తీసుకొస్తున్నాం. ప్రపంచంలోని నాలెడ్జ్ ను, బెస్ట్ ప్రాక్టీస్ తీసుకొచ్చి మీ ఇంటిదగ్గరే అందించేలా సంజీవని పని చేస్తుంది. ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానాన్ని అమలు చేస్తున్నాం. 42 రకాల వైద్య పరీక్షలు ఇంటి దగ్గరే చేస్తాం. ఏ మందులు వేసుకోవాలి, ఎప్పుడు ఆసుపత్రులకు రావాలో సంజీవని ద్వారా చెప్తారు. యూనివర్సిల్ హెల్త్ పాలసీ తీసుకొచ్చాం. రూ.2.5 లక్షల విలువైన వైద్యం ఉచితంగా అందిస్తాం. ప్రజలు ఆసుపత్రులకు వెళ్లే పరిస్థితి తెచ్చుకోవద్దు. తినే తిండి, మన పరిసరాలు, మన ఆలోచనా విధానం చాలా ముఖ్యం. ప్రభుత్వం ఎన్ని వైద్య సేవలు తెచ్చినా, ఆసుపత్రులు కట్టినా ప్రజలు మద్దతు లేకుంటే సాధ్యం కాదని అన్నారు.మంచి అలవాట్లు, ఆహారం, వ్యాయామం ఆరోగ్యానికి పనికొస్తాయి. యోగాకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రాణాయామంకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నాం. ఫుడ్ మెడిసిన్...కిచెన్ ఫార్మసీ. మనం తినే ఆహారమే మనల్ని రక్షిస్తుంది. ఒకప్పుడు కావాల్సిన పంటలు ఎరువులు లేకుండా పండించారు. కానీ ఈ రోజు మొత్తం యూరియా వాడుతున్న ఆహారం తీసుకుంటున్నాం. తెలిసీ తెలియక ఎక్కువగా క్రిమి సంహారక మందులు వాడుతున్నారు. గత ప్రభుత్వంలో నాసిరకం మద్యం కారణంగా చాలామందికి ఆరోగ్య సమస్యలు వచ్చాయి. ప్రజల జీవితాలతో చెలగాటమాడారుని అన్నారు. .

# ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి - మునిసిపల్ కమిషనర్ ప్రభాకర్



**జహీరాబాద్, జూన్ 3 ప్రజాబలం ప్రతినిధి:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని జహీరాబాద్ మునిసిపల్ కమిషనర్ ప్రభాకర్ పిలుపునిచ్చారు. జహీరాబాద్ పట్టణంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ యూనుస్, అటవీ శాఖ రేంజ్ అధికారి శ్యామ్ సుందర్ రావ్ తో కలిసి కూరగాయల మార్కెట్ ,బస్టాండ్ ప్రాంతాల్లో వ్యాపారులకు, ప్రజలకు ప్లాస్టిక్ నిషేధం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఇష్ట రీతిన ప్లాస్టిక్ ను వాడుతూ పర్యావరణ పరిరక్షణకు భంగం కలిగించవద్దని సూచించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ వాడకాన్ని పూర్తిగా తగ్గించేందుకు ప్రతి ఒక్కరు తమ వంతుగా కృషి చేయాలని కోరారు. ప్లాస్టిక్ రైత జహీరాబాద్ ను మార్చే విధంగా సహకరించి ప్లాస్టిక్ స్థానంలో ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అటవీ శాఖ అధికారులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మునిపల్లిలో మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 03(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా** :మునిపల్లి/బుధవారం నాడు అందోల్ నియోజకవర్గ పరిధిలో మునిపల్లి మండలం పోల్కంపల్లి గ్రామ శివారులోని పిఎస్ఆర్ గార్డెన్లో మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పైతర సాయికుమార్

బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు,అనంతరం పైతర సాయికుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి,రాష్ట్ర సాధన తర్వాత సిద్దిపేట ఎమ్మెల్యేగా మరియు రాష్ట్ర ఆర్థిక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం,కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ అభివృద్ధికి హరీష్ రావు కృషి ఎనలేనిది,ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో జీవించాలని,రాష్ట్ర ప్రజలకు మరింత సేవ చేయాలని ఆ భగవంతుడిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని పేర్కొన్నారు,హరీష్ రావు నాయకత్వ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రం అందోల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు,ఈ కార్యక్రమంలో మునిపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ మండల మాజీ ప్రధాన కార్యదర్శి మంతూరి శశికుమార్,మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు గడ్డం భాస్కర్,సర్పంచులు బొడిశెట్టిపల్లి సంగన్న,హైద్ల పూర్ తలారి రమేష్ ,మల్లికార్జున పల్లి మల్లేశం,మాజీ సర్పంచులు భాగన్న,ఐలాపూర్ విట్టల్,బొడిశెట్టిపల్లి పాండు,బొడిశెట్టిపల్లి హనుమంతు,మాజీ అధ్యక్షులు దత్తు ముదిరాజ్, లింగం పల్లి అధ్యక్షులు ఆఫ్సర్,తక్కడపల్లి ఆనంద్,ఇబ్రహీంపూర్ నాగన్న,పార్టీ సీనియర్ నాయకులు,హైద్ల పూర్ బక్కన్న ,నాయకులు డాక్టర్ సుల్తాన్ ,, పోల్కంపల్లి శ్రీకాంత్,శేఖర్,మునిపల్లి భద్రప్ప, మునిపల్లి రాజేందర్, ఖమ్మం పల్లి భాస్కర్, ఖమ్మం పల్లి కలల రాము, సోషల్ మీడియా మిత్రులు శివకుమార్, ఆఫ్సర్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు పై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్




**జహీరాబాద్: జూన్ 3 ప్రజాబలం ప్రతినిధి:** విధుల్లో ఉన్న పోలీసు లపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు చిరాగ్ పల్లి ఎస్సై రాజేందర్ రెడ్డి తెలిపారు. చిరాగ్ పల్లి విధులు నిర్వహిస్తున్న చాకలి తుకారం, మన్నే గణేష్ అనే కానిస్టేబుల్ లో విధుల్లో భాగంగా మే 31న ప్రభుత్వ మోటార్ సైకిల్ పై ధనసరి గ్రామంలో నుండి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన నిందితుడు ఆర్య రమేష్ వారిని అడ్డగించి అసభ్య పదజాలంతో దూషించి, మోటార్ సైకిల్ తాళం చెవిని లాక్కున్నాడన్నారు. కానిస్టేబుల్ గణేష్ ను తోసి వేయగా కిందపడి చేతికి గాయం అయిందన్నారు. కానిస్టేబుల్ గణేష్ తుకారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయస్థానం రిమాండ్ విధించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ అధికారులు విధులు నిర్వహిస్తున్న సమయంలో ఎవరైనా వారికి దూషించిన, అడ్డుకున్న, దాడి చేసిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో సైబర్ జాగృత్ దివస్ అవగాహన సదస్సు

**బిజినెస్ ఇన్వెస్ట్మెంట్, లోన్ యాప్, ప్రకటనల పేర్లతో జరుగుతున్న మోసాల గురించి అవగాహన..**

**సైబర్ నేరాల నుండి బయటపడాలంటే అవగాహన ఒక్కటే మార్గం:జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపిఎస్.**




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 03(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా** సంగారెడ్డి/సైబర్ నేరాల నుండి ప్రజలకు విముక్తి కల్పించడానికి తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ ఏర్పాటు చేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో ద్వారా సైబర్ జాగ్రుకత దివాస్ పేరుతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలను చైతన్య పరచడం జరుగుతుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలియజేశారు,జూన్ నెల మొదటి బుధ వారాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ రోజ సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా సైబర్ జాగ్రుకత దివాస్ పేరుతో ఆన్లైన్ మోసాల గురించి అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ ఎన్.వేణుగోపాల్ రెడ్డి,ఆధ్వర్యంలో సంగారెడ్డి మండలం, చర్యాల్ గ్రామంలోని ఎక్సెల్ ప్లాంట్ యూనిట్-4 ఉద్యోగులు మరియు సిబ్బందికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు,ఈ సందర్భంగా సైబర్ నేరగాళ్ళు ప్రస్తుతం ఉపయోగిస్తున్న వివిధ రకాల మోసపూరిత పద్ధతుల గురించి వివరించి, సైబర్ నేరాల భారీన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించడం జరిగింది.

1. బిజినెస్ ఇన్వెస్ట్మెంట్ మోసాలు-- అధిక లాభాల పేరుతో పెట్టుబడులు వస్తాయని మోసపూరిత మాటలు చెప్పి మొదట డబ్బులు వస్తున్నట్లు చూపించి, సైబర్ నేరాలకు పాల్పడతారని అన్నారు.
2. అడ్వర్టైజ్మెంట్ ఫ్రాడ్ -- నకిలీ కస్టమర్ కేర్ నంబర్లు, ఆన్లైన్లో ఆర్డర్ చేసిన వస్తువులు అందకపోవడం వంటి మోసాలు.
3. ఇంపర్సనేషన్ / కొరియర్ ఫ్రాడ్ -- కొరియర్ కంపెనీ ప్రతినిధులమని లేదా ఇతర అధికారులమని చెప్పి మోసం చేసే పద్ధతులు.
4. లోన్ యాప్ ఫ్రాడ్ -- అక్రమ రుణ యాప్‌ల ద్వారా ప్రజలను మోసం చేయడం, వేధించడం.
5. ఓఎల్ఎక్స్ ఫ్రాడ్ -- వస్తువుల కొనుగోలు, అమ్మకాల పేరుతో జరిగే ఆన్లైన్ మోసాలు.గుర్తు తెలియని వ్యక్తులు, అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులు మరియు పెట్టుబడి ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత మరియు బ్యాంకు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు.

సైబర్ మోసాలకు గురైనట్లు తెలిసిన వెంటనే 1930 హెల్ప్‌లైన్ కు కాల్ చేయాలని లేదా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో డి4సి డిఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఇన్స్పెక్టర్ రవి,ఇంద్రకరణ్ ఎస్ఐ విజయ్, సైబర్ సెల్ సిబ్బంది,ఎక్సెల్ ప్లాంట్ యూనిట్-4 యాజమాన్యం, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రవేట్ పాఠశాలల బస్సుల వయోపరిమితి పెంచాలి

రాయచోటి, జూన్ 03: ప్రైవేటు పాఠశాలల బస్సుల వయోపరిమితిని పెంచాలని రాష్ట్ర ప్రైవేటు విద్యాసంస్థల రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు మదన్మోహన్ రెడ్డి రాష్ట్ర రవాణా శాఖ మంత్రిని మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి కోరారు బుధవారం రాయచోటిలో మదన్ మోహన్ రెడ్డి విలేకరుల సమావేశంలో గ్రామీణ విద్యార్థులకు సేవలందిస్తున్న ప్రైవేటు పాఠశాలల బస్సుల అమలు తీరుపై విపులంగా వివరించారు గ్రామీణ ప్రాంతాల్లో వేలాది మంది విద్యార్థుల విద్యాభ్యాసానికి అండగా నిలుస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులకు ప్రస్తుతం అమలులో ఉన్న 15 ఏళ్ల వయోపరిమితిని 20 ఏళ్లకు పెంచాలని ప్రైవేట్ విద్యాసంస్థల రాష్ట్ర జేఏసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు రవాణా శాఖ మంత్రి మండిపల్లె రామ్ ప్రసాద్ రెడ్డిను విజయవాడ-తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించింది.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 వేల ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు విద్యార్థులకు రవాణా సేవలు అందిస్తున్నాయని జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వ బస్సులతో పోలిస్తే విద్యాసంస్థల బస్సులు రోజుకు కేవలం 30 నుంచి 60 కిలోమీటర్ల మేర మాత్రమే ప్రయాణిస్తాయని, 15 ఏళ్ల కాలంలో ఇవి సగటున 3 నుంచి 4 లక్షల కిలోమీటర్లు మాత్రమే తిరుగుతాయని వివరించారు. అదే సమయంలో ప్రభుత్వ బస్సులు 15 లక్షల కిలోమీటర్లకు పైగా ప్రయాణిస్తున్నప్పటికీ, విద్యాసంస్థల బస్సులపై కఠిన వయోపరిమితి విధించడం సమంజసం కాదని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే విద్యాసంస్థల బస్సులకు 20 ఏళ్ల వరకు మినహాయింపు కల్పించిన విషయాన్ని గుర్తు చేసిన జేఏసీ నాయకులు, అదే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేయాలని కోరారు. కోవిడ్ కాలంలో ప్రభుత్వ బస్సులకు రెండేళ్ల అదనపు సడలింపు ఇచ్చిన నేపథ్యంలో, విద్యాసంస్థల బస్సులకు కూడా న్యాయం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ రవాణా సౌకర్యాలు అందుబాటులో లేని చోట్ల విద్యాసంస్థల బస్సులే వేలాది మంది విద్యార్థులను పాఠశాలలు, కళాశాలలకు చేర్చుతున్నాయని తెలిపారు. వయోపరిమితి కారణంగా భారీ సంఖ్యలో బస్సులు రోడ్లపై నుంచి తప్పుకుంటే విద్యార్థుల రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడటంతో పాటు పేద, మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన బస్సులును కొనుగోలు చేయాలంటే సుమారు 40 లక్షల వ్యయం అవుతోందని, అది విద్యార్థులకే భారం అవుతుందని విన్నవించారు.అదేవిధంగా విద్యాసంస్థల బస్సులపై విధిస్తున్న పన్నులను తగ్గించి విద్యారంగానికి మరింత ప్రోత్సాహం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. జేఏసీ కన్వీనర్ డా. పాపిరెడ్డి మదన మోహన్, కో-కన్వీనర్ మోహన్ రావు మంత్రికి సమస్యలను వివరించగా, మంత్రి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు జేఏసీ ప్రతినిధులు వెల్లడించారు.విద్యార్థుల భద్రతకు ఎలాంటి భంగం కలగకుండా, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని విద్యాసంస్థల బస్సులకు 20 ఏళ్ల మినహాయింపు కల్పిస్తే వేలాది మంది విద్యార్థుల రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది అని జేఏసీ నాయకులు పేర్కొన్నారు.

# ఘనంగా మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు



జహీరాబాద్, జూన్ 3 ప్రజాబలం ప్రతినిధి: రాష్ట్ర మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు జన్మదిన వేడుకలను జహీరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే మానిక్ రావు ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు కేక్ ను కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరా సంఘం మండల కేంద్రంలోని కేతకి సంగమేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో హరీష్ రావు జన్మదిన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని అల్లిపూర్ చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు చేపట్టి హరీష్ రావు ఆయురారోగ్యాలతో ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండప్ప, మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు నారాయణ యాదవ్, వెంకటేశం, సంజీవరెడ్డి, మున్సిపల్ కకౌన్సిలర్లు మహిపాల్, దీపక్ , గౌస్ గౌరీ జాహేద్, జావిద్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు తంజుం, యాకూబ్, విశ్వేశ్వర్, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# స్వర్గీయ బాగా రెడ్డి సేవలు చిరస్మరణీయం - ఎమ్మెల్యేలు మాణిక్ రావు, సంజీవరెడ్డి



జహీరాబాద్, జూన్ 3 ప్రజాబలం ప్రతినిధి: జహీరాబాద్ మాజీ ఎంపీ మాజీ మంత్రి స్వర్గీయ బాగా రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. బాగా రెడ్డి 22వ వర్ధంతి సందర్భంగా మాజీ డిసిసిబి చైర్మన్ జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వర్ధంతి సభలో బాగా రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యేలతో పాటు బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి



స్థానిక నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాగా రెడ్డి ఏడుమార్లు ఎమ్మెల్యేగా నాలుగు పర్యాయాలు ఎంపీగా విజయం సాధించి జహీరాబాద్ ప్రాంతం తో పాటు ఉమ్మడి మెదక్ జిల్లాకు ఎంతో అభివృద్ధి చేశారన్నారు. మెదక్ ఎంపీ స్థానాన్ని త్యాగం చేసి మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఆ స్థానంలో పోటీ చేయించి ఘనవిజయం సాధించేందుకు కృషి చేశారన్నారు. ప్రధాని ఇందిరాగాంధీ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో అనేక భారీ పరిశ్రమలను నెలకొల్పడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని గుర్తు చేశారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల మనసులు గెలుచుకున్న అజాతశత్రువని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండప్ప, మాజీ జడ్పిటిసి శేఖర్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డి, వెంకటేశం, విజయ మోహన్ రెడ్డి, సుభాష్ రెడ్డి, గొల్లభాస్కర్, బాగా రెడ్డి అభిమానులు పాల్గొన్నారు

# గోపీనాథ్ ముండేకు భారతరత్న ప్రకటించాలని వంజరి సంఘాల డిమాండ్



హైదరాబాద్, 03 జూన్ 2026 (ప్రజాబలం ప్రతినిధి)దేశంలోని బడుగు, బలహీన వర్గాల రాజకీయ సాధికారత కోసం విశేషంగా కృషి చేసిన ప్రముఖ నేత, స్వర్గీయ గోపినాథ్ ముండే కు భారతరత్న పురస్కారం ప్రకటించాలని అఖిల భారత వంజరి సేవా సంఘం, తెలంగాణ వంజరి సేవా సంఘం కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి. అలాగే ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశాయి.

గోపీనాథ్ ముండే 13వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లో వంజరి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, దేశంలోని బడుగు వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు, వారికి ప్రత్యామ్నాయ జాతీయ రాజకీయ వేదికను అందించేందుకు గోపీనాథ్ ముండే నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. జాతీయవాద రాజకీయాల్లో వెనుకబడిన వర్గాల ప్రాతినిధ్యాన్ని పెంచడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, అందువల్ల భారతరత్నకు అన్ని విధాలా అర్హులని అన్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలోనే మరణించిన గోపీనాథ్ ముండే సేవలను గుర్తించి, ఆయన జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాలను కోరారు. తెలంగాణ రాష్ట్రానికి గోపీనాథ్ ముండే వంటి ప్రజానాయకుల అవసరం ఎంతో ఉందని వారు అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో అఖిల భారత వంజరి సేవా సంఘం నాయకులు సాల్వేరు కృష్ణ, ఎదుగని శంకర్, ఎదుగని హరినాథ్, కాలేరు సురేష్, ధాత్రిక కాశీనాథ్, కాలేరు యుగంధర్, రిటైర్డ్ డీఎస్పీ శివప్రసాద్, ఆముద లక్ష్మణ్, మహదేవ్ ముండే, కాలేరు సాయిబాబా, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో ఘనంగా హరీశ్ రావు జన్మదిన వేడుకలు...

## రక్తదాన శిబిరం, ప్రభుత్వం ఆసుపత్రిలో పండ్ల పంపిణీ,అన్నదాన కార్యక్రమం

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 03(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా: సంగారెడ్డి/సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో,సదాశివపేటలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు,ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు,నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్






చేసి హరీశ్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు,అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించి సామాజిక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు,తదుపరి సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు,అలాగే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు,అనంతరం మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్,హరీశ్ రావు సమర్థవంతమైన నాయకుడని కొనియాడారు,అధికార పక్షంలో ఉన్నా,ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల సమస్యలపై అదే స్థాయిలో స్పందిస్తూ పనిచేసే నాయకుడు హరీశ్ రావు అని పేర్కొన్నారు,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం హరీశ్ రావు పనితీరును మెచ్చుకునే వారని అన్నారు,హరీశ్ రావు మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని, ఆయురారోగ్యాలతో పాటు మరింత మేధస్సు, శక్తిని దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు హరీశ్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు,ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, డాక్టర్ శ్రీహరి, మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్ రెడ్డి,చింత సాయినాథ్, వేణుగోపాలస్వామి,సునీల్ జై, కౌన్సిలర్లు, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పారిశ్రామికాభివృద్ధితో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి ఆవుల రాజిరెడ్డి



ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్03 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా హత్నూర, మండలం బోర్పట్ల,గ్రామంలో ఏర్పాటు చేసిన (తెర నైమ్ బయాలజీక్స్ )పరిశ్రమ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ దామోదర రాజ నరసింహ , పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ డి. శ్రీధర్ బాబు,తో కలిసి నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి, మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్రంలో కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. బోర్పట్లలో ప్రారంభమైన ఈ బయోలాజిక్స్ పరిశ్రమ స్థానిక ఆర్థికాభివృద్ధికి తోడ్పడటంతో పాటు పరిసర ప్రాంతాల యువతకు ఉద్యోగ అవకాశాలుకల్పించనుందని,పేర్కొన్నారు. పెట్టుబడిదారులకు ,అనుకూలమైన విధానాలతో,తెలంగాణ దేశంలోనే పారిశ్రామిక రంగానికి ఆదర్శంగా నిలుస్తోందని ,ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకుప్రజలందరూ సహకరించాలనిపిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో (జిఐఐఎస్ )చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, కాంగ్రెస్ పార్టీ



నాయకులు,కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు, పరిశ్రమ ప్రతినిధులు, మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నరసరావుపేట క్రికెట్ బుకీ గోల్డ్ శేఖర్ అరెస్ట్

నరసరావుపేటలో క్రికెట్ బుకీ గోల్డ్ శేఖర్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. దీంతో కోట్ల రూపాయల లావాదేవీల గుట్టు రట్టయింది. నరసరావుపేటలో గత కొన్ని సంవత్సరాలుగా క్రికెట్ బెట్టింగ్ మాఫియాలో కీలకంగా వ్యవహరిస్తున్న గోల్డ్ శేఖర్ అలియాస్ కందుకూరి వీరశేఖరచారి కీలకంగా వ్యవహరిస్తున్నాడని పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నరసరావుపేట టూ టౌన్ సిఐ ప్రభాకర్ తెలిపారు. నరసరావుపేట టూ టౌన్ పోలీసులు చాకచక్రంతో నంద్యాల జిల్లా మహానంది సమీపంలో అతనిని అదుపులోకి తీసుకున్నారు. అతనితో పాటు ఒక మహిళను కూడా అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు. సాధారణ గోల్డ్ అప్రైజర్‌గా ప్రారంభమైన గోల్డ్ శేఖర్, తర్వాత క్రికెట్ బుకీ అవతారం ఎత్తి కోట్ల రూపాయల లావాదేవీలు నిర్వహించినట్లు సీఐ ప్రభాకర్ వెల్లడించారు. క్రికెట్ బెట్టింగ్‌లు, ట్రేడింగ్ పేరుతో మోసాలు చేస్తూ భారీ స్థాయిలో డబ్బులు సంపాదించినట్లు విచారణలో బయటపడింది సిఐ ప్రభాకర్ తెలిపారు. గోల్డ్ శేఖర్‌పై ఇప్పటికే పలు క్రికెట్ బెట్టింగ్ కేసులు, పోక్సో, ఎన్‌డీపీఎస్ కేసులు నమోదై ఉన్నాయని సీఐ తెలిపారు. తాజాగా రూ.1.44 కోట్ల మోసం కేసులో కీలక నిందితుడిగా అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ ప్రభాకర్ వెల్లడించారు. ఇంకా ఈ కేసులో మరికొందరు నిందితులు పరారీలో ఉన్నారని, త్వరలో వారిని కూడా అరెస్ట్ చేస్తామని టూ టౌన్ సిఐ ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిఐ ప్రభాకర్ తో పాటు స్టేషన్ ఎస్ ఐ లు సౌందర్ రాజన్, యష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లా నూతన డీఈవో రోహిణిని మర్యాదపూర్వకంగా కలిసిన

# టీవైజేఎఫ్ నాయకులు








**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 03 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ( టీ వై జె ఎఫ్ ) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జితేందర్ రావు తనుగుల, ఆదేశాల మేరకు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్, ఆధ్వర్యంలో (టీవైజేఎఫ్) ప్రతినిధి బృందం సంగారెడ్డి జిల్లా,నూతన జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) రోహిణి,ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలుతెలియజేసింది. ఈ సందర్భంగా జర్నలిస్టుల,కుటుంబాలు ఎదుర్కొంటున్న విద్యా సంబంధిత సమస్యలను, డీఈవో దృష్టికి తీసుకెళ్లిన టీవైజేఎఫ్ నాయకులు, జర్నలిస్టుల పిల్లలకు నాణ్యమైన విద్యను ఉచితంగా లేదా ప్రత్యేక రాయితీలతో అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ, వినతిపత్రాన్నిసమర్పించారు,సమాజానికిసమాచారాన్ని అందించడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి కుటుంబాల సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు,టీవైజేఎఫ్ సమర్పించిన వినతిపత్రంపై డీఈవో రోహిణి, సానుకూలంగా స్పందిస్తూ, జర్నలిస్టుల పిల్లల విద్యకు సంబంధించి చట్టపరమైన మరియు ప్రభుత్వ నిబంధనల పరిధిలో సాధ్యమైన సహాయ సహకారాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.డాక్టర్ జితేందర్ రావు తనుగుల, నాయకత్వంలో టీవైజేఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వారి కుటుంబాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తోందని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. జర్నలిస్టుల పిల్లలకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడం ద్వారా,వారి భవిష్యత్తును మరింత బలోపేతం చేయాలన్నదే సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలోటీవైజేఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జగత్ కృష్ణ, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ మహమ్మద్ నయమతుల్లా, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆకాష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్, సంగారెడ్డి టౌన్ వైస్ ప్రెసిడెంట్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వాడకం వల్ల మానవ మనుగడకే ప్రమాదం...



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 03(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/తారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సహకారముతో జిల్లా కాలుష్య నియంత్రణ బోర్డు మరియు కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజాపాలనబి ప్రగతి ప్రణాళిక కార్యక్రమములో భాగంగా పర్యావరణం పై అవగాహన, సింగిల్ ప్లాస్టిక్ వినియోగాల వల్ల నష్టం అనే అంశాలకు సంబంధించి వకృత్వ మరియు వ్యాసరచన




పోటీలను నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రవీణ మరియు జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి, జిల్లా పర్యావరణ ఇంజనీర్ విజయలక్ష్మి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపినారు,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా పర్యావరణ నియంత్రణ బోర్డు అధికారి మరియు జిల్లా పర్యావరణ ఇంజనీర్ ఎన్. విజయలక్ష్మి మాట్లాడుతూ సింగిల్ ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ సంబంధిత వ్యాధులు రావడమే కాక జంతు,వృక్షజాలం మనుగడకే ప్రమాదమని, ప్రతి ఒక్కరూ పర్యావరణం పైన అవగాహన కలిగి ఉండి పర్యావరణానికి కాలుష్యాన్ని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, దాని బదులుగా మట్టిలో సులభంగా కలిసిపోయే జనపనారవస్తులు, కాగితపు తయారీ వస్తువులను ప్రతి ఒక్కరూ వాడినప్పుడే పర్యావరణంలో సమతుల్యత ఏర్పడుతుందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చునని తెలిపినారు. యువతలో పర్యావరణం పై అవగాహన కల్పించడానికి "సింగిల్ ప్లాస్టిక్ వినియోగ నివారణలో యువత పాత్ర" అని అంశముపై వకృత్వపు పోటీని మరియు "ఘన వ్యర్థాల నిర్వహణబి పౌరుల బాధ్యత" అనే అంశముపై వ్యాసరచనను నిర్వహించడం జరిగిందని తెలిపినారు. వ్యాసరచనలో జి. మహేష్ గౌడ్ ప్రథమ; ఎన్.సంతోష్ కుమార్ ద్వితీయ; ఎం.సిద్ధార్థ తృతీయ బహుమతులను గెలిపొందిన్నారని తెలిపినారు. అదేవిధంగా "సింగిల్ యూస్ ప్లాస్టిక్ నివారణలో యువత పాత్ర " అనే అంశంపై నిర్వహించిన వకృత్వపు పోటీలో జి. మహేష్ గౌడ్, ప్రథమ; ఎన్.సంతోష్ కుమార్, ద్వితీయ; ఆంద్రూ, తృతీయ బహుమతులను గెలుపొందినారని పేర్కొన్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణంలో సమతౌల్యాన్ని కాపాడడానికి కృషి చేయాలని, ఆరోగ్యవంతమైన పర్యావరణాన్ని భవిష్యత్తు తరాలకు అందించవలసిన బాధ్యత నేటి యువతపై ఉందని, మనమందరము ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, భూమిలో కరిగే వస్తువుల వినియోగాన్ని పెంపొందించాలని, ప్రధానంగా ఆహార పదార్థాలు, కూరగాయల వంటి వాటి వినియోగంలో జ్యూట్ బ్యాగులు, వస్త్రముతో తయారుచేసిన బ్యాగులు, పేపర్ బ్యాగులను వాడాలని, ప్లాస్టిక్ వినియోగముపై పూర్తిగా ఆధారపడడం తగ్గించాలని, అప్పుడే ఈ భూమిపై జంతు, జీవ, వృక్షజాతుల మనుగడ సాధ్యమై, వాయు,భూమి, నీటి కాలుష్యాలు తగ్గడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ మరియు ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జగదీశ్వర్, జిల్లా పర్యావరణాధికారి మాధవ రెడ్డి, జిల్లా కాలుష్య నియంత్రణ బోర్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అలిపిరిలో ఉద్రిక్త వాతావరణం

తిరుపతి అలిపిరిలో తోపుడు బండ్లు చిరు వ్యాపారులకు మద్దతుగా నిరసన కు వైసిపి పిలుపునిచ్చింది. అలిపిరిలో అనుమతులు లేని తోపుడు బండ్లు ,చిరు దుకాణాలను ప్రభుత్వ సిబ్బంది తొలగించింది. టిడిపి అనుకూల వ్యాపారుల కోసం చిరు వ్యాపారుల దుకాణాలు తొలగించారని వైసిపి ఆరోపణ. నిరసన చేయడానికి వచ్చిన తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జి భూమన అభినయ రెడ్డి, వైసిపి నేతలు కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. వారిని అరెస్టు చేసి స్టేషన్కు తరలించారు. పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉండడంతో నిరసనకు అనుమతి నిరాకరించారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# గ్రేటర్ జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వండి

## -అక్రెడిటేషన్ తో సంబంధం లేకుండా ఇవ్వాలి

## -ముఖ్యమంత్రికి జీహెచ్ జే సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి

హైదరాబాద్, జూన్ 03: సుప్రీం కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా వర్కింగ్ జర్నలిస్ట్స్ యాక్ట్ ప్రకారం అన్ని కేటగిరీల్లోని జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జర్నలిస్టులందరికి వెంటనే ఇళ్ళస్థలాలు కేటాయించాలని సమావేశం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం






అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా.. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం విచారకరమని పలువురు సీనియర్ జర్నలిస్టులు అన్నారు. బుధవారం హైదరాబాద్ చిక్కడపల్లి లోని శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళ స్థలాలు, సుప్రీంకోర్టు తీర్పు, ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీకి స్థలం లేదా సభ్యులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని సమావేశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతూ తీర్మానించింది.

అక్రెడిటేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం ఇవ్వాలని, జర్నలిస్టుల్లో వివక్ష చూపొద్దని సమావేశం కోరింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పని చేస్తున్న అన్ని కేటగిరీల జర్నలిస్టులకు 200 చ. గ స్థలాన్ని ఫ్యూచర్ సిటీలో కేటాయించాలని కోరుతూ సమావేశం తీర్మానించింది.

సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, సొసైటీలో సభ్యత్వం తీసుకున్న 1350 మంది గ్రేటర్ జర్నలిస్టులు 18 ఏళ్ళుగా ఇంటి జాగల కోసం ఎదురు చూస్తున్నారని, గత ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని, కనీసం ఈ ప్రభుత్వం అయినా ఇళ్ళస్థలాలిచ్చి ఆదుకోవాలని కోరారు. గ్రేటర్ సొసైటీలో ఉన్న దాదాపు 1350 మంది జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం చాలా ఏళ్ళుగా ఎదురుచూస్తున్నారని, ఇప్పటికే ఎంతోమంది జర్నలిస్టులు స్థలం పొందకుండానే చనిపోయారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, పలువురు మంత్రులను కలిసి పలుమార్లు విన్నవించినప్పటికీ స్థలం కేటాయింపునకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా ప్రభుత్వం చేతులెత్తేసిందని, మొన్న జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళస్థలాలపై ఎటువంటి నిర్ణయం లేదని, నిన్న జరుపుకున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో ముఖ్యమంత్రి చేసిన ప్రసంగంలో జర్నలిస్టుల సంక్షేమం, ఇళ్ళస్థలాల మాటే లేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును పక్కన పెట్టి ప్రత్యామ్నాయ జీవోల ద్వారా జర్నలిస్టు సొసైటీలకు స్థలాలు ఇవ్వాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు.

**మద్దతు ప్రకటించిన కోదండరాం**

సొసైటీ సర్వసభ్య సమావేశానికి హాజరుకావాల్సి ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అనివార్యకారణాల వల్ల హాజరుకాలేకపోయారు. దీంతో ఆయన ఫోన్ ద్వారా తన సందేశాన్ని సమావేశానికి వినిపించారు. గ్రేటర్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి తన మద్దతు ఉంటుందని, ముఖ్యమంత్రితో మాట్లాడి జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇచ్చేవిధంగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా సమావేశానికి రావాల్సిన రాజ్యసభ సభ్యులు ఎం. అనిల్ కుమార్ యాదవ్ కూడా అత్యవసర పని వల్ల రాలేకపోయారు. ఆయన కూడా సొసైటీ సమావేశానికి మద్దతు తెలియజేశారు. అంతకు ముందు సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నైశిదం సత్యనారాయణ మూర్తి, తెలంగాణ జనసమితి గ్రేటర్ బీసీ సెల్ అధ్యక్షుడు జశ్వంత్,
సీనియర్ జర్నలిస్టులు తీగవరపు శాంతి, నాగవాణి, సొసైటీ కోశాధికారి తన్నీరు శ్రీనివాస్, డైరెక్టర్లు యర్రమిల్లి రామారావు. రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీగా ఫసల్‌వాది...

## జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు

## న్యూఢిల్లీలో జాతీయ పురస్కారం స్వీకరించిన జిల్లా కలెక్టర్,గ్రామ సర్పంచ్

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 03(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి మండలంలోని ఫసల్‌వాది గ్రామ పంచాయతీ మహిళా సాధికారత,మహిళలకు అనుకూలమైన సేవలు,సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రతిభ కనబరిచి "ఉమెన్ ఫ్రెండ్లీ థీమ్" కేటగిరీలో జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించింది,ఈ సందర్భంగా బుధవారం న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర పంచాయతీరాజ్, మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ (లాలన్ సింగ్), కేంద్ర సహాయ మంత్రి ఎస్.పీ. సింగ్ బఘేల్ చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేశారు,సంగారెడ్డి జిల్లా తరఫున జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఫసల్‌వాది గ్రామ సర్పంచ్ హరి ప్రసాద్,పంచాయతీ కార్యదర్శి గోవింద్ శెట్టి ఈ జాతీయ అవార్డును స్వీకరించారు,ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జానకి రెడ్డి, డిపిఓ మల్లారెడ్డి, డి ఎల్ పి ఓ అనిత, ఎంపీఓ శ్రీకాంత్ పాల్గొన్నారు,మహిళల సంక్షేమం, భద్రత,సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, గ్రామాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించే చర్యల ఫలితంగానే ఈ గుర్తింపు లభించింది.






# ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలి.

## ప్రజల భాగస్వామ్యంతో ఎం కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 3 కలెక్టరేట్** జూన్ 4, 6, 8, 10 తేదీలలో నిర్వహించనున్న గ్రామ, వార్డు సభల ఏర్పాట్లపై బుధవారం జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.



జిల్లాలోని ప్రతి గ్రామంలో గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలని, అన్ని శాఖల



అధికారులు సమన్వయంతో పనిచేసి వీటిని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సభలకు మండల స్థాయి అధికారులు అందరూ విధిగా హాజరుకావాలని, ఇందుకు సంబంధించిన సిబ్బంది వివరాలను తక్షణమే సమర్పించాలని ఆదేశించారు. ఎండాకాలం తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, గ్రామ సభలను ఉదయమే నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సభలు జరిగే చోట తాగునీరు వంటి అన్ని కనీస మౌలిక వసతులు కల్పించాలని, షెడ్యూల్ వివరాలను గ్రామాల్లో ముందే చాటింపు వేయించి ప్రజలకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

సభలలో కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి కుటుంబం మొక్కలు నాటేలా అవగాహన కల్పించాలని సూచించారు. రహదారుల చుట్టు పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించి అవెన్యూ ప్లాంటేషన్ లో మొక్కలు నాటాలని తెలిపారు. మురుగుకాల్వలు పరిశుభ్రం చేయుట, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఇండ్ల నుండి వచ్చే మురుగునీరు రోడ్లపైకి వెళ్లకుండా కమ్యూనిటి, వ్యక్తిగత ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులు అందించేందుకు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. గ్రామసభలలో మహిళల రక్షణ, బాల్య వివాహాలు, మాదకద్రవ్యాల నివారణ, రహదారి భద్రతపై అరైవ్ అలైవ్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రానున్న వర్షాకాలంలో గ్రామాలలో పారిశుధ్యం, మురుగు కాలువల శుభ్రత, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, భారీ అకాల వర్షాల వల్ల వాగులు వంకలు పొంగితే తీసుకోవాల్సిన రక్షణ చర్యలు ప్రజలను తరలించేందుకు అవగహన కల్పించాలని తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలను సిద్ధం చేసుకోవాలని, రాష్ట్ర, కేంద్ర ప్రకృతి విపత్తుల ప్రతిస్పందన బృందాలను, రెస్క్యూ బృందాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఇట్టి కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. ఎన్ లినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు వ్యవసాయ అధికారులను ఆదేశించారు. పంటల అవశేషాలు కాల్చొద్దని దాని వల్ల భూమిలో ఉన్న పోషకాలు చనిపోతాయని కలియదున్నడం వల్ల భూమికి బలం పెరుగుతుందని తెలిపారు.

ఈ సమావేశం లో అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు, జిల్లా అధికారులు, తహసిలార్లు, ఎం పి డి ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

# కాలుష్యం నియంత్రణపై కాలేజీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 3 ములుగు**ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక” యొక్క 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి జూన్ 3వ తేదీన జిల్లా స్థాయిలో కళాశాల విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించింది.



ఈ కార్యక్రమము జిల్లాస్థాయి నోడల్ ఆఫీసర్ గా వి. అరుణాదేవి, అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్ , తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి గారి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా తను మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని, ముఖ్యంగా యువత ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలను ఆచరణలో పెట్టి సమాజానికి మార్గనిర్దేశకులుగా నిలవాలని ఆమె సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన మరియు చర్యలకు ప్రాధాన్యం ఇచ్చే వేదికగా నిర్వహించబడుతుందని ఆమె పేర్కొన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థుల కోసం నాలుగు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అవి 1) వ్యాసరచన –రెఫ్యూజ్ ప్లాస్టిక్ రిస్టోర్ నేచర్ 2) “పచ్చని భవిష్యత్తు కోసం సుస్థిర అభివృద్ధి” అంశంపై పోస్టర్ మేకింగ్, 3) పాటల పోటీ ,4)“ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలు” అంశంపై వక్తృత్వ పోటీ. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర జీవన విధానాలు, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ వంటి అంశాలపై విద్యార్థులు చురుకుగా తమ ప్రతిభను ప్రదర్శించారు.

డా. కె. సరిత, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ములుగు, ఇంచార్జ్ ప్రిన్సిపల్ మరియు ఎకోక్లబ్ కన్వీనర్, తన సందేశంలో, విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ పెంపొందించడం, సుస్థిర అభివృద్ధి భావనను బలపరచడం, హరిత భవిష్యత్తు నిర్మాణంలో యువత పాత్రను చాటి చెప్పడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు ప్రకృతి పట్ల బాధ్యతను అలవరచుకోవాలని ఆమె సూచించారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్.దేవకి, ఎన్.ఎస్.ఎస్ .ప్రోగ్రాం కోఆర్డినేటర ప్రసన్న కుమార్ , ఎం.డి. ఆయాజ్ ఖాన్,పి.ఎం. శ్రీ. టి.జి.ఎం.ఎస్. జూనియర్ కాలేజ్, బండారుపల్లి, విద్యార్థులతో పాటు పాల్గొన్నారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మేమంటోలు, అందజేయడంతో పాటు, పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. హర్షిత, ఓస్ బారన్ మరియు సంజన వక్తృత్వంలో, బన్నీ పాటల విభాగశీ లో, ఏం. సిరివెన్నెల, ఆసిఫ్ , మోహిసినా పోస్టర్ మేకింగ్ లో, తన్మయి, మనోజ్, సుశాంత్ వ్యాసరచన పోటీలలో బహుమతులు గెలుపొందారు.

# వినియోగదారుల తక్షణ సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ వేణుగోపాల్‌రావు



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూన్3** ఏటూరునాగారం: విద్యుత్ వినియోగదారులకు తక్షణ బి వి పరిష్కారం కోసమే విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేసినట్లు సీజీఆర్ఎఫ్(విద్యుత్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ) చైర్మన్ వేణుగోపాలచారి తెలిపారు.

బుధవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో వినియోగదారుల ఫోరం వేదికలో వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ అధికారులు వినియోగదారుల సమస్యలను పట్టించుకోకపోతే ఫోరంకు ఫిర్యాదు చేయాలన్నారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు తీసివేయడం, కొత్తవి మార్చడం, మీటర్ల ను అమర్చడం, బిల్ అధికంగా రావడం వంటి సమస్యలను మా ఫోరం సమస్యను పరిష్కరిస్తోంది. ఏటూరునాగారం మండల కేంద్రంలో ప్రధాన రోడ్డు వెంట ఉన్న స్తంబాలు కొత్తవి వేయాలని, తీగలను అమర్చాలని పలువురు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై అధికారులను ఆదేశించి స్తంబాలను నూతనంగా అమర్చాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. 1912కు కూడా సమాచారం అందజేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చు అన్నారు. 33 కేవీలైన్స్‌లో కూడా లూజు లైన్స్ ఉన్న ప్రాంతాల్లో కొత్తవి పోల్స్ వేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు.

స్థానికంగా ఈఆర్ఓ కార్యాలయం అధికారులు బిల్లుల హెచ్చుతగ్గుల విషయాన్ని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. వాట్సప్‌లో కూడా ఫిర్యాదు చేసే అవకాశాలను కల్పించామన్నారు. వెనుకబడిన ప్రాంతాలు కావడంతోపాటు గాలి దుమారాలు వచ్చే ప్రాంతం కావడంతో ఇక్కడ వాటిని తట్టుకునేందుకు 200 కిలోల బరువు ఉన్న సిమెంట్ పోల్స్‌ను ఏర్పాటు చేయడం కోసం ఇప్పటికే సీఎండీ ద్వారా అమనుతి వచ్చిందని, త్వరలోనే గాలి దుమారాలను తట్టుకునే పోల్స్ వేస్తారని ఫోరం చైర్మన్ వేణుగోపాలచారి తెలిపారు. అంతేకాకుండా విద్యుత్ శాఖలో పనిచేసే అధికారులు వినియోగదారులు చెప్పిన ఫిర్యాదును పట్టించుకోకపోతే వాటిని వెంటనే పరిష్కరిస్తూ వినియోగదారుడికి న్యాయం చేస్తామన్నారు. సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఫైనాన్స్ సభ్యుడు దేవేందర్, ఇండిపెండెంట్ సభ్యుడు రామారావు, డీఈ పురుషోత్తం, ఏడీఈ ఉమారావు, సబ్ ఇంజనీర్లు, ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

# పలు సమస్యలపై ఎంపీడీవో గారిని కలిసి వినతి పత్రం అందజేసిన మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు చిటమట రఘు మరియు కొండాయి సర్పంచ్ ఆలం మానస నాగార్జున్



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూన్ 3** బిపంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులు సీతక్క ఆదేశాల మేరకు పైడాకుల అశోక్ సూచన మేరకుబుధవారం 11 గంటలకు ఏటూరునాగారం మండల ఎంపీడీవో గారిని మర్యాదపూర్వకంగా కలసి మండలంలో ఉన్న పలు సమస్యలపై వినతిపత్రం అందజేయడం జరిగింది.

ఇట్టి సమస్యల పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకొని వెంటనే పరిష్కరించవలసిందిగా కోరినారు.

అదేవిధంగా గ్రామాల్లో వచ్చిన అభివృద్ధి పనులు వెంటనే చేయాలని, రానున్నది వర్షాకాలం కాబట్టి పనులకు అంతరాయం కలుగుతుందని వెంటనే అభివృద్ధి పనులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసును కోరడం జరిగింది.బిలి బిఈ కార్యక్రమంలో పాయం కమలక్క తదితరులు పాల్గొన్నారు

# మేక వనం పల్లి వరి కొనుగోలు కేంద్రంలో మోసపోయానని రైతు కాశీనాథ్ ఆవేదన వ్యక్తపరిచాడు



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జూన్ 3 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మోమినిపేట మండలం మేకవనం పల్లి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రంలో ఒక సంచి తూకము 42 కేజీలు 63 సంచులకు 84 కేజీలు రైతు దగ్గర నుండి జహంగీర్ సెంటర్లో వడ్లు కట్ చేసినట్టు గుర్తించిన యజమాని కాశీనాథ్ ఆవేదన వ్యక్తపరిచాడు ప్రభుత్వం వరి కేంద్రాలు ఏర్పాటు చేసి అందులో దళారుల చేతుల్లో రైతు మోసపోకూడదని ప్రభుత్వము మంచి అభిప్రాయంతో కార్యక్రమాన్ని ప్రారంభించిన చివరికి అందులో కూడా రైతులకు అన్యాయం జరగడం బాధాకరంగా ఉందని రైతు కాశీనాథ్ ఆవేదన వ్యక్తపరిచాడు ఇట్టి విషయంపై అధికారులు స్పందించి రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా వరి సెంటర్లు నడిపించాలని లేదంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లవలసి ఉంటుందని రైతు కాశీనాథ్ ఆవేదన వ్యక్తపరిచాడు

# తెలంగాణ శాసనసభాపతి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జన్మదిన శుభాకాంక్షలు మర్పల్లిరాయల్ హార్డ్వేర్ ఎలక్ట్రానిక్ ప్రొప్రైటర్ మొహమ్మద్ గౌసో ద్దీన్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జూన్ 3(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం వికారాబాద్ శాసనసభ్యులు తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మర్పల్లిరాయల్ హార్డ్వేర్ ఎలక్ట్రానిక్ ప్రొప్రైటర్ మొహమద్ గౌసో దీన్ తెలంగాణ శాసనసభాపతి ప్రియతమ నాయకులు గడ్డం ప్రసాద్ కుమార్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఈ లాంటి పుట్టిన రోజులు జరుపుకోవాలని రాయల్ హార్డ్వేర్ ఎలక్ట్రానిక్ ప్రొప్రైటర్ మహమ్మద్ గౌసో ద్దీన్ తెలిపారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449